జన రాజకీయం కోసం... ₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 14

జూలై 16-31, 2018



జిల్లాల వారీగా లోక్‌సత్తా పార్టీ సురాజ్య సదస్సులు

## ఖజానా ఖాళీ చేయటం తప్ప ప్రజలకు ఆరోగ్యాన్ని అందించలేని 'ఆయుష్మాన్ భారత్'







ర్యాంక్ రాలేదని
గమ్యం మార్చుకుంటారా?

మళ్ళీ ప్రయత్నిస్తే..!
ఈ ఆలోచనే
చాలామందిని
డాక్టర్స్‌ని చేసింది.

అవగాహనున్న కాలేజి..
అనుభవమున్న ఫ్యాకల్టీ

# NEET LONG TERM 2018

LIMITED SEATS!

2015, 2016
2017- 2018 లలో
ప్రతి ముగ్గురిలో
ఒకరికి
డాక్టర్ సీట్

NEET- 2018 లో
450 కి పైగా మార్కులు
సాధించిన వారికి
ఫ్రీ కోచింగ్

ఫీజు రాయితీ
NEET- 2018 లో
400 కి పైగా మార్కులు
సాధించిన వారికి

Classes Start From 03-07-2018

NRI Academy
centre for global education
under the management of NRI Educational Society

# PLOT NO : 198 NEW BALAJI COLONY , MR PALLI , TIRUPATI.

Ph No : 98668 81482 | 81257 71569 | 94402 05260 | 83091 47124

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

జులై 16-31, 2018 సంపుటి - 9 సంచిక - 14

## కార్టూన్ కార్నర్




ఏం చేయమంటావ్.. ఇక్కడ బ్యాంకులన్నీ ఆర్థిక నేరగాళ్లతో దివాలా తీస్తున్నాయి.. అక్కడ సేఫ్‌గా ఉంటాయని వెళ్తున్నా!

## లోపలి పేజీల్లో...

హెల్త్ ఎమర్జెన్సీ యువతను ఉద్యోగాల ............... 5
ఆరేళ్లలో ప్రజారోగ్యంపై ఒక్క రూపాయి కూడా........ 7
ప్రజారోగ్యంలో వ్యత్యాసాలు.............................. 9
'మోదీ కేర్' (ఆయుష్మాన్ భారత్) కి కౌంట్‌డౌన్....... 11
ఖజానా ఖాళీ చేయటం తప్ప ప్రజలకు ............. 14
బ్రిటన్‌లో ఫ్యామిలీ డాక్టరే కీలకం........................ 20
పేదరికాన్ని కొనసాగించటానికి సింపుల్ ............ 22
తెలుగు రాష్ట్రాల్లో 30 శాతం మంది చిన్నారుల్లో..... 24
ఆదర్శ పౌరుడికి హిందూ, ముస్లిం పేరుతో ........... 26
జులై 15 నుండి జిల్లాలవారీగా సురాజ్య ............. 27
పెద్ద నోట్ల రద్దు నాటి దృశ్యాలను గుర్తుకు.............. 28
పంటల బీమాల్లాగా లేవు............................... 29
రైతుల ప్రతి పథకం కౌలురైతుకూ అందాలి........... 31
(మీడియాలో) 'కీ' కామెంట్లు............................ 32
గోళ్లూడగొట్టి ట్యాక్సులు వసూలు చేస్తున్నారు......... 34

## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
*ప్రధాన సంపాదకులు*

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి.కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

ఫోన్ : **040-23310288**
ఫోన్ / ఫ్యాక్స్ : **040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# ప్రమాదకరం కాదా!?



లక్నోలోని ఓ పాస్‌పోర్టు అధికారిపై విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ చర్య తీసుకోవటంపై ట్విట్టర్‌లో నిర్వహించిన పోల్‌లో.. 'ఆమె మీద చేయి చేసుకోండని' ఒక వ్యక్తి సుష్మ భర్త స్వరాజ్ కౌశల్‌కు సూచించాడు. 'ఇంటికి వచ్చాక ఆమెను కొట్టండి. ముస్లింలను బుజ్జగించడం మానుకోవాలని బుద్ధిచెప్పండి' అని ట్వీట్ చేశాడు. "మీ ఆవిడను ఇంకా కొడుతున్నారా లేదా అంటే ఏం చెప్తాం?" అని పరిహాసమాడటం.. భారతదేశంలో ప్రశ్నల్ని దాటవేసే ఒక తరహా లౌక్యం! భార్యలు కూడా భర్తల మీద ఆ రకంగా జోక్ వేసే పరిస్థితి ఉండి, ముద్దుగా ఒకరి మీద ఒకరు చేయిచేసుకునే పరిస్థితి ఉంటే మనం పట్టించుకోనక్కర్లేదుగానీ.. చాలాచోట్ల పరిస్థితి అందుకు విరుద్ధం. మహిళలను కొట్టినా తప్పు లేదనే (ఆమె మంత్రి అయినా సరే) పురుషాధిక్య భావజాలమే కొనసాగుతోందిక్కడ. ఈ హింసను చాలామంది భారతీయ కుటుంబ వ్యవస్థలో భాగంగానే చూస్తారు. అయినా కూడా.. 'మహిళలకు ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన దేశం భారత్' అని థామ్సన్ రాయిటర్స్ ఫౌండేషన్ సంస్థ తన సర్వేలో తేల్చటం మనలో పలువురికి కోపం తెప్పించింది. జాతీయ మహిళా కమిషన్ కూడా నిర్ద్వంద్వంగా ఖండించింది. ఈ ప్రతిస్పందన ఒకమేర సరైనదే! కొందరు పార్టీ రాజకీయవాదులు ఏకపక్షంగా సమర్థించినా కూడా.. థామ్సన్ రాయిటర్స్ సర్వే మదింపు సక్రమం కాదనటంలో సందేహం లేదు. ఇస్లాం ఉగ్రవాదానికి బలవుతున్న సిరియా, ఆఫ్ఘనిస్తాన్‌ల్లో, మతఛాందసత్వం రాజ్యమేలుతున్న మరికొన్ని దేశాల్లో మహిళల పరిస్థితి దయనీయంగా ఉంది. హక్కులు, ఎదిగే అవకాశాలు లేకుండా వాళ్లు కట్టుబానిసల్లా ఉన్నారు. అగ్రరాజ్యం అమెరికాలో కూడా మనదేశంలో కంటే లైంగిక దాడులు, అత్యాచారాల సంఖ్య అనేక రెట్లు ఎక్కువ. రేప్‌లకు నిర్వచనం, ఫిర్యాదు వంటి వాటిల్లో మనకంటే మెరుగ్గా ఉన్నాయనుకున్నా.. బ్రిటన్, పలు యూరోపియన్ యూనియన్ దేశాల్లో కూడా లైంగిక అత్యాచారాలు ఇండియాలో కంటే చాలా ఎక్కువ. కానీ ఆ దేశాలన్నిటికంటే భారత్ ప్రమాదకరమని తేల్చారు. పాఠశాల స్థాయి నుంచి నేను బీబీసీ వార్తలను రేడియోలో ఎంతో శ్రద్ధగా వింటుండేవాడిని. ప్రామాణికతలో, ప్రజాస్వామిక దృక్కోణంలో ఉన్నతస్థాయి మీడియా సంస్థ బీబీసీ అని ఇప్పటికీ భావిస్తాను. కానీ అదే బీబీసీ కొన్ని సంవత్సరాల క్రితం భారత్‌ను 'ప్రపంచ రేప్‌ల రాజధానిగా' ముద్ర వేస్తూ 'ఇండియాస్ డాటర్' అనే డాక్యుమెంటరీని 'ఎడిట్ చేసి మరీ' విదేశాల్లో ప్రదర్శించింది. భారత్‌కు నీతులు చెప్పే ముందు.. మీ దేశంలో, ఇతర పాశ్చాత్య దేశాల్లో పరిస్థితిని చక్కదిద్దుకోవాలని నాతోపాటు ఇంకొందరు పౌరులు కూడా అప్పుడు ఘాటుగా గళం విప్పారు. మన దేశంలోని లైంగిక దుర్మార్గాల గురించి వర్ణిస్తూ పుస్తకాలు రాసిన భారతీయ రచయిత్రులతో నిర్వహించే టాక్ షోలలో.. తామేదో భారత్ కంటే ఉన్నత విలువలు కలవారన్నట్టు బ్రిటీషర్లు, ఇతర పాశ్చాత్యులు సంకుచిత వ్యాఖ్యానాలు చేయటాన్ని ఆమోదించటం బీబీసీ ప్రమాణాలకు ఎంతమాత్రం తగదు. తమకు లేని నైతిక ఆధిపత్యాన్ని మన మీద చెలాయించాలన్న విదేశీయుల ఈ రకమైన ధోరణుల్ని గట్టిగా గర్హించాల్సిందే. అదేసమయంలో.. మనదేశంలోని వాస్తవ పరిస్థితిని కూడా నిజాయతీగా అంగీకరించాలి. మొగుడు కొట్టినందుకు కాదు తోడికోడలు నవ్వినందుకు, ఇతర ప్రాంతాల కంటే మనం మెరుగే.. అనే ధోరణులను దాటి నిజాల్ని నిష్పాక్షింగా సమీక్షించుకుంటే మాత్రం- పెద్ద ప్రమాద హెచ్చరిక అవసరమైన పరిస్థితుల్లోనే మన దేశం ఉంది. థామ్సన్ రాయిటర్స్ సర్వే కేవలం కొందరు నిపుణుల అభిప్రాయాలు మాత్రమేనని సరిపెట్టుకోలేం. మహిళల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపే అనేక అంశాలు భారత్‌లో ఆందోళనకర స్థాయిలోనే కొనసాగుతున్నాయి, పెరుగుతున్నాయి. అధికారిక అంచనాల ప్రకారమే.. 2007 నుంచి 2016 మధ్యకాలంలో మహిళలపై లైంగిక దాడులు 83 శాతం పెరిగాయి. ప్రతి గంటకూ 4 అత్యాచారాలు, 39 దాడులు జరుగుతున్నాయి. భ్రూణ హత్యలు ఆగలేదు. వేధింపులు, అక్రమ రవాణా వంటివి భయపెట్టేలా పెరిగిపోతున్నాయి. దేశంలో ఆర్థిక వృద్ధి రేటు పెరుగుతున్నా.. సంపద సృష్టిలో మహిళలు భాగస్వాములు కాలేకపోతున్నారు. వేధింపుల్ని తట్టుకోలేక ఉద్యోగాలు మానేస్తున్నవారి సంఖ్య కూడా తక్కువేమీ కాదు. ఉద్యోగాలు చేస్తున్నవాళ్లలో కూడా.. ప్రశాంతతను ఫణంగా పెట్టి అప్రమత్తతతో నెట్టుకొచ్చేవాళ్లే ఎక్కువ. వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలన్నిటిలోకన్నా మహిళా ఉద్యోగుల సంఖ్య మనదేశంలోనే తక్కువ. ఇది దేశ ఆర్థిక వృద్ధిని కూడా ప్రతికూలంగా ప్రభావితం చేస్తోంది. థామ్సన్ రాయిటర్స్ సర్వేలోని అవాస్తవికతను తిరస్కరిస్తూనే.. మహిళల పట్ల మన సమాజ తీరుతెనుల్ని సమూలంగా మార్చుకోవటం మీద దృష్టి సారించాలి. ఇంతకు ముందే చెప్పుకున్నట్టు.. తమ పట్ల వివక్ష చూపుతున్నారు అనే ఆలోచన కూడా మహిళల్లో రేకెత్తకుండా, 'ఇది మామూలే' అనే మోరల్ న్యూట్రాలిటీతో వారిని అణచివేసే, కంఫర్ట్ జోన్‌లో బందీలుగా చేసే ధోరణులు మన కుటుంబ వ్యవస్థలో అంతర్లీనంగా ఉన్నాయి. కుటుంబ వ్యవస్థలోని బలాన్ని పటిష్టం చేసుకుంటూనే.. అందులోని బలహీనతల్ని రాజ్యాంగ విలువలతో పరిహరించుకోవాలి. భార్యను రేప్ చేసినా తప్పులేదనే అప్రజాస్వామిక, అమానవీయ ధోరణులకు స్వస్తి చెప్పాలి. వివక్ష, హింస ప్రదర్శించేవారు కుటుంబ సభ్యులైనా సహించకూడదు. కుటుంబ విలువలు బలంగా లేకుండా.. కేవలం రాజ్యాంగం మీద సాంకేతికంగా ఆధారపడి ఇంట్లో మహిళలకు పోలీసు రక్షణ ఏర్పాటు చేసే అగ్రరాజ్యాల్లా మనం వ్యవహరించనక్కర్లేదు. ఎన్ని సమస్యలున్నా పోలీసు పరిష్కారంకన్నా.. కుటుంబ సభ్యుల మధ్య ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో పరిష్కరించుకోవటమే ఉత్తమం. పోలీసు జోక్యం.. ఆఖరి అస్త్రం మాత్రమే కావాలి. కానీ రాజ్యాంగం మహిళలకిచ్చిన సమాన హక్కుల ప్రాతిపదికనే ఆ పరిష్కారం ఉండాలి. రెండో ప్రపంచయుద్ధం వంటి కారణాల వల్ల పాశ్చాత్య దేశాల్లో మహిళలు సంపదసృష్టిలో భాగమయ్యే చొరవను ఎక్కువగా ప్రదర్శించగలుగుతున్నారు. మహిళల్లో అలా పెద్ద మార్పుని తెచ్చే తీవ్ర సంక్షోభాలేవీ ఆధునిక కాలంలో మనదేశాన్ని పెద్దగా ప్రభావితం చేయలేదు. విజ్ఞత గల సమాజం అలాంటి సంక్షోభాలను సృష్టించాలనో, రక్తపాతాన్ని తేవాలనో అనుకోదు. నాగరిక పద్ధతుల్లో వేగంగా మార్పుల్ని తెస్తుంది. భారతీయ కుటుంబ వ్యవస్థకు, రాజ్యాంగ విలువలకు మధ్య అగాధాన్ని తొలగించాలంటే.. చట్టబద్ధపాలన, ఆరోగ్య పరిరక్షణ, విద్య-ఉపాధి, స్థానిక స్వయంపాలన, ప్రజాస్వామిక ప్రాతినిధ్యం వంటి మౌలికాంశాల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు తమ ప్రధాన బాధ్యతలుగా అమలుచేయాలి. వీటి అమలు వల్ల.. వ్యవస్థలో నిందితులుగా, పలు సందర్భాల్లో సమాజ బాధితులుగా ఉన్న పురుషులు కూడా అవకాశాలను అందుకుని, మార్పులో భాగస్వాములు కాగలుగుతారు. కూతురిగా, సోదరిగా, భార్యగా, కోడలిగా, తల్లిగా, స్త్రీగా కంటే కూడా మనిషిగా మొదట తన గుర్తింపును చాటుకునే మహిళల తరం మొదలవుతుంది.



# హెల్త్ ఎమర్జెన్సీ: యువతను ఉద్యోగాల కంటే ఎక్కువ పరేషాన్ చేస్తున్న ఆరోగ్యం!

**ప్రజలకు నాణ్యమైన వైద్యం, విద్య అందించటం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత.**

**భారతదేశ జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న "యువతలో అత్యధికులు తమ ఆరోగ్యం, తల్లిదండ్రుల ఆరోగ్యం గురించే ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగం కంటే కూడా ఆరోగ్యమే వారిని ఎక్కువగా వ్యాకులతకు గురిచేస్తోందని" 2017 డిసెంబర్‌లో వెలువడిన ఓ ర్యాండమ్ సర్వే తేల్చింది.**

**.. ఇంత ప్రాధాన్యతగల ఆరోగ్య రంగం గురించి ప్రభుత్వాలు ఎంత వేగంగా స్పందించాలి!?**

**కానీ.. ఎన్నికైన ప్రభుత్వాలు చేయాల్సిన మౌలిక బాధ్యతలేమిటి, పాలకుల నుంచి సేవల్ని ఎలా పొందాలి అనే అవగాహన ప్రజల్లో కొరవడటం, సేవల్ని పొందటానికి తగిన వ్యవస్థలు లేకపోవటంతో పాలకులు దశాబ్దాలుగా ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతూ దేశాభివృద్ధిని దెబ్బతీస్తున్నారు.**

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత బ్రిటన్ ఆర్థికంగా చితికిపోయిన తరుణంలో.. దేశం కోలుకోవటానికి తీసుకోవాల్సిన కీలకచర్యగా ప్రజలందరికీ ఆరోగ్యాన్ని ప్రధాని అట్లీ ప్రతిపాదించారు. అలా 1948లో సార్వత్రిక ఆరోగ్యసేవా పథకం (ఎన్‌హెచ్ఎస్) బ్రిటన్‌లో వచ్చింది. ఈవేళ మనదేశానికి తగినన్ని వనరులున్నాయి, నిపుణులైన వైద్యసిబ్బంది ఉన్నారు, మందుల్ని తక్కువ ఖర్చుతో అందించే కంపెనీలున్నాయి.. కానీ ప్రజలకు మాత్రం సరైన వైద్యం అందటం లేదు. కేవలం వైద్యఖర్చులను తట్టుకోలేక ఈ దేశంలో ఏడాదికి 6 కోట్లమందికి పైగా పేదరికంలోకి జారిపోతున్నారు. ఇంత అమానవీయమైన దృశ్యం ప్రపంచంలో మరే నాగరిక దేశంలోనూ కనిపించదు. పొరుగున ఉన్న శ్రీలంక కూడా మనకంటే వైద్యంలో మెరుగ్గా ఉంది. కొన్నాళ్ల క్రితం భారత్‌కు వచ్చిన సందర్భంలో మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ కూడా మనదేశంలో వైద్యం మీద వ్యయం తీరును చూసి దిగ్భ్రమని వ్యక్తం చేశారు. ప్రజలు కోలుకోలేకుండా దెబ్బతినేలా ప్రభుత్వ ఆరోగ్య విధానాన్ని భారత్ అనుసరిస్తోందని వ్యాఖ్యానించారు.



బిల్ గేట్స్ పక్కన కూర్చుని ఫోటోలు దిగాలనుకుని ఆరాటపడే, చారిత్రక పురుషులమని డబ్బా కొట్టుకునే మన నేతలకు మాత్రం జాతికి తాము చేస్తున్న ఘోర అన్యాయం ఇంకా జ్ఞానోదయం కాలేదు. ఎయిడ్స్ వ్యాధి ఆఫ్రికాలో ఒక తరాన్ని నాశనం చేసిందని తెలిసినా.. మన నాయకుల్లో మానవీయత, మంచి ఆలోచనలు మేల్కోవటం లేదు.

భారతదేశంలో వైద్యం ఎంత ఖరీదైపోయిందో, వైద్య ఆరోగ్య విధానం ఎంత ప్రజావ్యతిరేకంగా ఉందో తెలియచెప్పే ఇటీవల విడుదలైన జాతీయ ఆరోగ్య వ్యయ నివేదిక (దీన్ని చూశాకే గేట్స్ షాక్ తిన్నారు) వెల్లడించింది. ఈ నివేదికలోని అంశాలను లోక్‌సత్తా చాలాకాలంగా చెబుతూనే ఉంది. జాతీయ ఆరోగ్య మిషన్ రూపశిల్పిగా, రెండవ పరిపాలనా సంఘం సభ్యునిగా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఈ సంక్షోభాన్ని, పరిష్కారాల్ని నిర్దిష్టంగా చెబుతూ వస్తున్నారు. సురాజ్య యాత్రలో కూడా ఈ అంశాల్నే విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. 1990 నుంచి 2016 మధ్యకాలాన్ని ప్రామాణికంగా తీసుకుని 'దేశంలో రాష్ట్రాల స్థాయుల్లో వ్యాధుల భారం' పేరిట రూపొందించిన జాతీయ ఆరోగ్య వ్యయ నివేదికలో పలు అంశాలను

**కళ్లు చెదిరే గణాంకాలు (2014-15 ప్రకారం)**

- మనదేశంలో మొత్తం ఆరోగ్య వ్యయం.. రూ.4,83,259 కోట్లు (ప్రస్తుత లెక్కల ప్రకారం ఈ సంఖ్య ఇంకా లక్షన్నర కోట్లు ఎక్కువని అంచనా). గ్రామీణ జనాభాలో 25శాతం ఇళ్లవారు, పట్టణాల్లో ప్రతి కుటుంబాల్లో ఒకటి హాస్పిటల్ ఖర్చుల్ని తట్టుకోలేక అప్పులు చేయటమో, ఆస్తుల్ని అమ్ముకోవటమో చేస్తున్నారు.
- ప్రభుత్వం ఆరోగ్యంపై పెడుతున్న ఖర్చు రూ.1,39,940 కోట్లు
- ప్రజలు జేబులో నుంచి సొంతంగా ఖర్చు పెడుతున్నది రూ.3,02,425
- 2014-15కు ముందు మూడేళ్ల గణాంకాల ప్రకారం.. ఆరోగ్య బీమాపై వ్యయం 1.6 శాతం నుంచి 3.7 శాతానికి పెరిగింది
- తెలంగాణలో ఏటా వైద్యానికయ్యే ఖర్చులో ప్రభుత్వ వాటా 22.3శాతం
- టీఎస్‌లో ప్రజలు సొంతంగా వైద్యానికి అదనంగా పెడుతున్న మొత్తం రూ.7,368 కోట్లు
- ఆంధ్రప్రదేశ్‌లో ఏటా వైద్యానికయ్యే మొత్తం ఖర్చులో ప్రభుత్వ వాటా 15.4శాతం
- ఏపీలో ప్రజలు సొంతంగా వైద్యానికి పెడుతున్న ఖర్చు రూ.17,988 కోట్లు. ఇక్కడ వైద్యానికి ఒక్కో కేసుకు సరాసరిన రూ.35, 671 ఖర్చవుతోంది. హాస్పిటల్ ఖర్చులు అత్యంత ఖరీదైన రాష్ట్రాల్లో ఒకటిగా ఏపీ ఉంది.

మరోవైపు, 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు కేంద్రం నుంచి పన్నుల వాటా పెరిగిన (తెలంగాణకు 25.25, ఆంధ్రప్రదేశ్‌కి 17.5శాతం) నేపథ్యంలో సామాజిక రంగంపై రాష్ట్రాల నిధుల వ్యయం పెరిగినా, స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో ఆరోగ్యం, విద్యపై ఆంధ్రప్రదేశ్‌లో వ్యయం తగ్గిందని నీతి ఆయోగ్ విశ్లేషణ వెల్లడించింది.

ప్రస్తావించారు. భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), భారత ప్రజారోగ్య సంస్థ (పీహెచ్‌ఎఫ్‌ఐ), ఆరోగ్య కొలమానాలు, విశ్లేషణ సంస్థ (ఐహెచ్‌ఎంఈ) సంయుక్తంగా నివేదికను రూపొందించాయి.

చాలా ఆలస్యంగా వెలువడిన ఈ నివేదికలోని కొన్ని అంశాలు:

వైద్యం మరీ ఖరీదైపోయింది. సర్కారు వైద్యంలో చికిత్స పొందినా.. వెలుపలి నుంచి ఔషధాలను కొనుగోలు చేయాల్సి రావడం, రోగ నిర్ధారణ పరీక్షలను ప్రైవేటు కేంద్రాల్లో చేయించాల్సి రావడంతో రోగికి చికిత్స ఉచితంగా చేసినా.. ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఇక ప్రైవేటులోకెళ్తే అడ్డగోలు పరీక్షలు, ఇష్టానుసార ధరలతో రోగి ఆర్థికంగా కోలుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఆరోగ్య బీమా ఉన్నా సరే.. వేర్వేరు రూపాల్లో కోతలు పెట్టి చివరకు రోగి నుంచి మొత్తం బిల్లులో దాదాపు 20 శాతం మేరకు డబ్బులు వసూలు చేస్తున్నారు. వైద్యానికెళ్తే ఇలా సగటు వ్యక్తి జేబుకు చిల్లు తప్పడం లేదని నివేదిక స్పష్టం చేసింది. వైద్యానికయ్యే ఖర్చు తలకు మించిన భారంగా మారుతోందని పేర్కొంది. తెలంగాణ, ఏపీ సహా అన్ని రాష్ట్రాల్లోనూ ప్రజలకు వైద్యసేవల్లో అదనపు ఆర్థికభారం తప్పడం లేదని తేల్చిచెప్పింది.

**ఆరోగ్యంపై అతితక్కువ వ్యయం, మానవాభివృద్ధిలో 130వ స్థానం**

జీడీపీలో విద్య, ఆరోగ్యంపై వివిధ దేశాల చేస్తున్న వ్యయంపై 2015 మానవాభివృద్ధి సూచికను తీసుకుంటే.. ప్రపంచ సగటు విద్యపై 4.4 ఉండగా, ఆరోగ్యంపై 6గా ఉంది. మనదేశంలో విద్యకు జీడీపీలో 3.8, ఆరోగ్యానికి 1.1శాతం మాత్రమే కేటాయిస్తున్నారు. కీలకరంగాలకు తక్కువ కేటాయింపుతోపాటు, ఇస్తున్న నిధుల్ని కూడా అసంబంధంగా ఖర్చు చేస్తుండటంతో మానవాభివృద్ధి సూచికలో దేశాల జాబితాలో మనం 130వ స్థానంలో ఉన్నాం.

తెలంగాణలో తలసరి అదనపు ఖర్చు రూ.2,834కాగా, ఆంధ్రప్రదేశ్‌లో రూ.2,901గా నమోదైంది. ఆరోగ్యంలో దేశంలోనే ముందున్న కేరళ రాష్ట్రంలోనూ తలసరి ఆరోగ్య అదనపు జేబు ఖర్చు రూ.5,023గా నివేదిక వివరించింది.

మొత్తం ఆరోగ్య ఖర్చులో ప్రభుత్వాలు పెడుతున్నది కేవలం 29శాతం. ఇందులోనూ కేంద్ర ప్రభుత్వ వాటా 37శాతం కాగా, రాష్ట్ర ప్రభుత్వాల వాటా 63శాతం. ఎక్కువ వైద్యసేవలు ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లోనే లభ్యమవుతుండటంతో.. అందుకనుగుణంగానే ప్రజలపై ఆర్థికభారం కూడా భారీగా పెరిగింది. సాధారణస్థాయిలోనే దేశవ్యాప్తంగా తలసరి ఏడాదికి రూ.2,394 చొప్పున ఆరోగ్యం కోసం అదనంగా జేబుల్లో నుంచి ఖర్చు పెట్టాల్సి వస్తోంది. అభివృద్ధి చెందిన, మిగిలిన అభివృద్ధి చెందుతున్న దేశాల నమూనాలను పరిశీలించినా.. మనదేశంలో వైద్యరంగంలో ప్రభుత్వ వాటా పెరగాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. ❖

# ఆరేళ్లలో ప్రజారోగ్యంపై ఒక్క రూపాయి కూడా పెరగని ప్రభుత్వ వాస్తవ వ్యయం -జాతీయ ఆరోగ్య ముఖచిత్రం 2018లో వెల్లడి-

ఆరోగ్య రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహు తక్కువ కేటాయింపులు చేస్తున్నట్టు జాతీయ ఆరోగ్య ముఖచిత్రం-2018 కూడా ధ్రువీకరించింది. "దేశం మొత్తమ్మీదా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ కలిపి 2015-16లో రూ.లక్షా 40వేల కోట్లు ఖర్చు చేశాయి. అంటే తలసరి ఖర్చు రూ.1,112. 2009-10లో తలసరి ఖర్చు రూ.621. జాతీయ స్థూల ఉత్పత్తితో పోల్చినపుడు కేటాయింపుల్లో మాత్రం 2009-10, 2015-16కు గుర్తించదగిన మార్పేమీ లేదని" నివేదిక వెల్లడించింది.

మొత్తం ఖర్చులో కేంద్రం వాటా 31 శాతం కాగా, రాష్ట్రాలు 69 శాతం ఖర్చు చేశాయి. మొత్తం వ్యయంలో వైద్య ఆరోగ్య శాఖ విభాగాల్లో 78.7 శాతం ఖర్చు చేయగా, కుటుంబ సంక్షేమానికి 12.6 శాతం వ్యయం చేశారు.

అనారోగ్యంతో ఒక్కసారి ఆస్పత్రిలో చేరితే భారీగా ఖర్చవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణ ప్రాంతాల్లో సరాసరి ఒక కుటుంబానికి ఖర్చు రూ.33,671 కాగా, తెలంగాణలో రూ.26,092. ఇదే గ్రామీణ ప్రాంతాల్లో అయితే వరుసగా రూ.15,411, రూ.13,698. అటు గ్రామీణ, ఇటు పట్టణ ప్రాంతాల్లోనూ వైద్యానికి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా ఖర్చవుతున్నట్టు జాతీయ ఆరోగ్య ముఖచిత్రం-2018 తెలిపింది. ఆరోగ్యరంగంలో ప్రభుత్వాలు చేస్తున్న తలసరి ఖర్చు తెలంగాణలో కంటే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువగా ఉంది. 2015-16లో ఆంధ్రప్రదేశ్ తలసరి ఖర్చు రూ.1,013 కాగా, తెలంగాణలో రూ.1,322గా ఉంది. వెనుకబడిన రాష్ట్రాలైన అసోం, జార్ఖండ్, ఉత్తరాఖండ్ ఎక్కువగా ఖర్చు చేస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో కేరళ రూ.1,463తో మొదటిస్థానంలో ఉంది. ఏడు ఈశాన్య రాష్ట్రాల్లో సరాసరి రూ.2,878 ఖర్చు చేస్తుండగా, మిజోరాం అత్యధికంగా రూ.5,862, అరుణాచల్‌ప్రదేశ్ రూ.5,177 వెచ్చించింది. పెద్ద



**మనదేశంలో ఆరోగ్య రంగానికి ప్రభుత్వం చేస్తున్న వ్యయం**

| సంవత్సరం | జీడీపీలో ప్రభుత్వ ఖర్చు శాతం |
|---|---|
| 2009-10 | 1.12 |
| 2010-11 | 1.07 |
| 2011-12 | 1.10 |
| 2012-13 | 1.09 |
| 2013-14 | 1.00 |
| 2014-15 | 0.98 |
| 2015-16 | 1.02 |
| 2016-17 (సవరణ బడ్జెట్) | 1.17 |
| 2017-18 | 1.28 |

రాష్ట్రాలన్నింటిలోనూ ఆరోగ్యరంగంపై చేసే ఖర్చు చాలా తక్కువగా ఉందని నివేదిక తెలిపింది.

ఆస్పత్రిలో చేరినవారు చేసే సరాసరి ఖర్చులో జాతీయ సగటు కంటే తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతంలో తక్కువగా

ఉండగా, పట్టణ ప్రాంతాల్లో మాత్రం ఆంధ్రప్రదేశ్‌లో చాలా ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో గుజరాత్‌లో సరాసరి చాలా ఎక్కువగా అంటే ఏకంగా రూ.32,503గా ఉంది. పట్టణ ప్రాంతాల్లో గుజరాత్‌లో తక్కువగా ఉంది. ఆంధ్రప్రదేశ్ కంటే పైన అసోం, గోవా, జమ్మూ కాశ్మీర్ మాత్రమే ఉన్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో అతితక్కువగా ఆస్పత్రిలో చేరినవారి సరాసరి వైద్య ఖర్చు రూ.8,286 కావటం గమనార్హం. జాతీయ సరాసరి కంటే ఇది బాగా తక్కువ. దేశం మొత్తమ్మీద చూసినపుడు ఆస్పత్రిలో చేరిన ఒక కుటుంబం ఖర్చు గ్రామీణ ప్రాంతంలో రూ.16,956 కాగా, పట్టణ ప్రాంతంలో రూ.26,455. అనేక రాష్ట్రాల్లో ఖర్చు ఈ సగటు కంటే ఎక్కువగా ఉంది.

ప్రసవాలకయ్యే ఖర్చు ప్రైవేటు ఆస్పత్రుల్లో చాలా ఎక్కువగా ఉందని కూడా నివేదిక వెల్లడించింది. ఒక బిడ్డ ప్రసవానికి సరాసరిన గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.1,587 ఖర్చవుతుండగా, ప్రైవేటు ఆస్పత్రిలో రూ.14,778 ఖర్చవుతోంది. ఇదే పట్టణ ప్రాంతాల్లో వరుసగా రూ.2,117, రూ.20,328గా పేర్కొంది.

గ్రామీణ ప్రాంతాల్లో 67.8 శాతం మంది వైద్యానికి తమ కుటుంబ ఆదాయం, ఆదా చేసుకున్న మొత్తం నుంచే ఎక్కువగా ఖర్చు చేస్తుండగా, పట్టణ ప్రాంతాల్లో 74.9 శాతం ఇలా వెచ్చిస్తున్నారు. గ్రామాల్లో 24.9 శాతం, పట్టణాల్లో 18.2 శాతం మంది ప్రైవేటు వ్యక్తుల నుంచి అప్పులు చేస్తున్నారు.

**43 కోట్ల మందికి ఆరోగ్య బీమా**

- 2016–17 లెక్కల ప్రకారం దేశంలో వ్యక్తిగతంగా ఆరోగ్య బీమా ఉన్నవారు 43 కోట్ల మంది.
- దేశ జనాభాలో ఇది 34 శాతం.
- ప్రభుత్వ బీమా కంపెనీల పరిధిలో ఉన్నవారు 79 శాతం మంది.
- కుటుంబాల మొత్తానికి సంబంధించిన, వ్యక్తిగత పాలసీల కోసం ప్రైవేటు బీమా కంపెనీలనే ఎక్కువమంది ఆశ్రయించారు.
- కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) కింద 2013–14లో చేసిన ఖర్చు రూ.1,839 కోట్లు.
- 2016–17లో రూ.2,238 కోట్లు.
- ప్రయోజనం పొందినవారి సంఖ్య మాత్రం 37 లక్షల నుంచి 31 లక్షలకు తగ్గిపోయింది.
- సీజీహెచ్ఎస్ కింద సరాసరి ఖర్చు 2013–14లో రూ.4,970 కాగా, 2016–17లో రూ.7,219.
- ఎంప్లాయిస్ ఇన్సూరెన్స్ స్కీం కింద 2.93 కోట్ల మంది ఉండగా, ప్రయోజనం కలిగేది 12.4 కోట్ల మందికి.
- ఈ పథకం కింద చేసిన ఖర్చు 2013లో రూ.4,058.13 కోట్లు కాగా, 2017 నాటికి రూ.6,256.57 కోట్లు.
- ప్రయోజనం పొందే వారి సంఖ్య 7.21 కోట్ల నుంచి 12.4 కోట్లకు పెరిగింది. తలసరి ఖర్చు మాత్రం రూ.563 నుంచి రూ.505కి తగ్గింది. 2016–17లోనే ఈ పథకం పరిధిలోకి నాలుగు కోట్ల మంది కొత్తగా వచ్చి చేరారు.

**ఇతర దేశాల కంటే చాలా తక్కువ**

స్థూల జాతీయ ఉత్పత్తిలో ఆరోగ్య రంగానికి భారత ప్రభుత్వం చేస్తున్న వ్యయం ఇతర దేశాల కంటే చాలా తక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. 2015లో భారతదేశం చేసిన వ్యయం జీడీపీలో ఒక శాతం కాగా, ఎక్కువ ఆదాయం కలిగిన దేశాలు 5.2 శాతం, మధ్యస్తంగా ఆదాయం కలిగిన దేశాలు 3.8 శాతం, దిగువ మధ్యతరహా ఆదాయం కలిగిన దేశాలు 2.5 శాతం వ్యయం చేశాయి. అతి తక్కువ ఆదాయం గల దేశాలు కూడా 1.4 శాతం ఖర్చు చేశాయి.

చిన్న దేశాలు, సరిహద్దు దేశాలు కూడా మన కంటే ఆరోగ్య రంగానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చాయి. మాల్దీవులు ఏకంగా 9.4 శాతం ఖర్చు చేయంగా, భూటాన్ 2.5, శ్రీలంక 1.6 శాతం చేశాయి. ఆరోగ్య రంగానికి ప్రభుత్వాలు చేస్తున్న తలసరి ఖర్చులో కూడా భారతదేశం వెనుకబడి ఉంది. మాల్దీవులు 770 డాలర్లు, థాయిలాండ్ 166 డాలర్లు, భూటాన్ 66, శ్రీలంక 63 డాలర్లు వెచ్చిస్తే మనం మాత్రం 16 డాలర్లు ఖర్చు చేస్తున్నాం.

❖

# ప్రజారోగ్యంలో వ్యత్యాసాలు

**- మహేష్ విజాపుర్కర్,**
సీనియర్ పాత్రికేయులు





మనం మొదట ఈ నాలుగు ఉదంతాలను అర్థం చేసుకుందాం. 1. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఒకరు చెన్నైకి ఎయిర్ అంబులెన్స్‌లో హుటాహుటిన బయలుదేరారు. అక్కడే ఆయన తర్వాత మరణించారు. ఆయనకు లివర్ కేన్సర్ ఉంది. 2. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇటీవలే చెన్నై ఆస్పత్రిలో సాధారణ ఆరోగ్య పరీక్ష చేయించుకున్నారు. 3. గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ చికిత్స కోసం మొదట ముంబయి ఆస్పత్రికి వెళ్లారు. తర్వాత వెల్లడికాని వ్యాధి చికిత్స కోసం అమెరికా వెళ్లారు. 4. సోనియా గాంధీ కూడా ఇదేవిధంగా అమెరికా వెళ్లారు. ఆమె వ్యాధి స్వభావం గురించి కానీ, ఆమె చికిత్స చేయించుకున్న ఆస్పత్రి వివరాలు కానీ చెప్పకుండా దాచి ఉంచారు.

పై ఉదంతాలను కింది వాటితో పోల్చి చూద్దాం.

1. ప్రసవానికి చేరువైన ఒక గర్భిణిని ఉదంపూర్‌లోని ఆస్పత్రిలో చేర్చడానికి అంబులెన్స్ సౌకర్యాన్ని నిరాకరించారు. దీంతో ఆమె ప్రైవేట్ అంబులెన్స్‌ని ఉపయోగించాల్సి వచ్చింది. తర్వాత ఆస్పత్రిలో ఆమెను మూడు గంటలపాటు ఏ డాక్టరూ పట్టించుకోలేదు. గర్భంలోనే పాప మరణించింది. ఆ పాప మృతదేహాన్ని ఒక అట్టపెట్టెలో ఉంచి వెనక్కు పంపించారు.

2. ముంబయిలోని ఎల్ఫిన్‌స్టన్ బ్రిడ్జి తొక్కిసలాట ఘటనలో రైలు ప్రయాణికుల విషాద మరణం తర్వాత చనిపోయినవారి నుదుటిపై స్కెచ్ పెన్‌తో మృతుల సంఖ్యను వరుసగా రాశారు. మృతుల గౌరవానికి భంగం కలిగించినందుకు హైకోర్టు ఆగ్రహం ప్రదర్శించింది.

3. ఒక వ్యక్తి, వైద్యులు తొలగించిన కాలిని పరుపుపై దిండుగా ఉపయోగించుకున్న ఘటన ఝాన్సీ ఆస్పత్రిలో సంభవించింది.

4. పాట్నాలో తొమ్మిదేళ్ల కుమార్తె మృతదేహాన్ని ఆమె తండ్రి తన భుజాలపై మోసుకుని వెళ్లాల్సి వచ్చింది. ఎందుకంటే ఆమెను గ్రామానికి తీసుకెళ్లడానికి అంబులెన్స్ సౌకర్యం కల్పించలేదు. ఆమెను అత్యవసరంగా ఆస్పత్రిలో చేర్పించడానికి చేపట్టాల్సిన విధివిధానాల విషయంలో చాలా జాగు చేశారు (మున్నాభాయ్ సినిమాలో దీనిపైనే నిరసన తెలిపారని గుర్తుంచుకోవాలి).

ఈ రెండు రకాల ఉదంతాలు కొట్టచ్చినట్టుగా మన ఆరోగ్య సంరక్షణ సంపన్నులకు, అధికార శక్తిమంతులకు అనుకూలంగా ఉందనే ఒక దయనీయ కథనాన్ని చెబుతున్నాయి. అత్యంత మొరటైన విషయం ఏమిటంటే, తాము పాలిస్తున్న రాష్ట్రాల్లో వైద్యపరమైన అసౌకర్యాలను పట్టించుకోని ముఖ్యమంత్రులు బయటి రాష్ట్రాలకు వెళ్లి వైద్య సహాయం కోసం ప్రయత్నించడమే.

ఇటీవలే అమితాబ్ బచ్చన్ భుజం నొప్పికి చికిత్స చేయడానికి వైద్యుల బృందం ఒకటి జైపూర్‌కు హుటాహుటిన చేరుకుంది. ఇంత సూపర్ సంపన్నుడికి అందుబాటులో

లేనిదంటూ ఏదీ ఉండదు. వారు పతాక శీర్షికల్లో కనిపిస్తుంటారు. నగటు మనిషి తన బాధలతో కుములుతుంటాడు. మనలాంటివారి బాధలు, ఇబ్బందులు మన చేతుల కంటే పొడవుగా కొనసాగుతుంటాయి. నిజానికి వాటికి అంతం అనేది ఉండదు.

ఇక్కడ వర్ణించిన రెండు రకాల ఉదంతాలూ అవేవో సర్వసాధారణం అన్నరీతిలో ప్రధాన శీర్షికల్లో వస్తుండటం ఒక మినహాయింపు. అదే సమయంలో దేశం ఇలాంటి వ్యత్యాసాలను ప్రదర్శించే తదుపరి ఉదంతాల వైపు సాగిపోతుంటుంది. గుర్తించాల్సింది ఏమిటంటే రాజకీయ ప్రముఖులు తమ రాష్ట్రాల్లో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను మెరుగుపర్చడానికి ఏ ప్రయత్నమూ చేస్తున్నట్టు కనిపించదు.

ఎందుకంటే దేశంలోని రాజకీయ ప్రముఖులంతా సంపన్నులూ, శక్తిమంతులూ కాబట్టే వీరిలో ఏ ఒక్కరికీ సగటు మనిషి బాధలు, వ్యధలు పట్టవు. ప్రభుత్వ నిధులతో నడుస్తున్న ఆస్పత్రుల్లో వైద్యసేవలు మెరుగొందుతున్నట్టుగా మంచి గణాంకాలను మాత్రం చూపుతుంటారు. మనుషులు గణాంకాలుగా మాత్రమే కనబడుతున్న వైనాన్ని ఇది సూచిస్తుంది.

ఆందోళన, ఆగ్రహం తప్పిస్తే ప్రజానీకం దీనిపట్ల పెద్దగా స్పందించడం జరగదు. ప్రముఖులు భారత్‌లోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళతారని, పారికర్, సోనియా వంటి కొందరు విదేశాలకు వెళతారని ప్రజలకు తెలుసు. ప్రభుత్వ నిధులతో నడిచే ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై ఈ ప్రముఖులకు ఏమాత్రం నమ్మకం లేదని ఇది సూచిస్తుంది. ప్రజావైద్య వ్యవస్థను మెరుగుపర్చడానికి తాము పెద్దగా ప్రయత్నించలేదని వారికి తెలుసన్న వాస్తవం మనకు బోధపడుతుంది కూడా.

సంవత్సరానికి ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున బీమాను పదికోట్ల కుటుంబాలకు కల్పిస్తున్నట్టు కేంద్రం చేసిన (ఆయుష్మాన్ భారత్) ప్రకటనను కూడా పై నేపథ్యంలో అనుమానాస్పదంగానే చూడాలి. ఎందుకంటే దేశంలో ప్రైవేట్ రంగం మాత్రమే మెరుగైన సౌకర్యాలను కలిగి ఉంది.

ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ఆస్పత్రుల్లోనే పేదలకు కొన్ని విభాగాలను ఏర్పర్చి ఉంచారు కానీ కార్పొరేట్ ఆస్పత్రుల్లోలాగా నడుస్తున్న ఈ విభాగాలు సైతం పేదలకు వైద్యాన్ని నిరాకరిస్తున్నాయి. ఎదుగుతున్న మధ్యతరగతితో సహా ఇలాంటి విభాగాల్లో వైద్యసేవలు పొందడానికి కూడా శక్తిలేనివారు శిలకు, బండరాయికి మధ్య నలిగిపోతుంటారు. ❖

*(కర్టెసీ: సాక్షి)*

# ఆరోగ్య సేవల్లో అదే దిగజారుడు

**ఆ**రోగ్య సేవల సూచీలో భారత్ దిగజారుడు కొనసాగుతోంది. ఈసారి 145వ స్థానం లభించింది. పొరుగు దేశాలైన చైనా, బంగ్లాదేశ్, శ్రీలంక, భూటాన్‌ల కంటే ఇందులో మన దేశం వెనుకబడింది. ఆరోగ్య సేవల నాణ్యత, అందుబాటుపై లాన్సెట్ సంస్థ ఈ అధ్యయనం నిర్వహించింది. 195 దేశాల ఆరోగ్య సేవల స్థితిగతులను పరిశీలించి నివేదికను రూపొందించింది. మరణానికి దారి తీసే 32 వ్యాధుల ఆధారంగా సూచీలో స్కోరు కేటాయించింది. ఈ వ్యాధులన్నీ నివారించదగ్గవి, మెరుగైన ఆరోగ్య సేవలతో కట్టడి చేయగల వీలున్నవి.

- 1990లలో కంటే మన దేశంలో ఆరోగ్య సేవల అందుబాటు, నాణ్యతల్లో పురోగతి కనిపించింది.
- అయితే దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య వ్యత్యాసం మాత్రం అంతకంతకూ పెరుగుతోంది. 1990లలో రాష్ట్రాల గరిష్ట, కనిష్ట స్కోరు మధ్య తేడా 23.4 పాయింట్లు ఉండగా, 2016లో ఇది 30.8కి పెరిగింది.
- గోవా, కేరళలకు దీనిలో 60 పాయింట్లకు పైగా పడ్డాయి. అసోం, ఉత్తర ప్రదేశ్‌లకు కనీసం 40 కూడా దక్కలేదు.
- పొరుగు దేశాలైనా చైనా (48), శ్రీలంక (71), బంగ్లాదేశ్ (133), భూటాన్ (134) దీనిలో మన కంటే మెరుగైన స్థానాలు సంపాదించాయి.
- ఐస్‌లాండ్ (97.1), నార్వే (96.6), నెదర్లాండ్స్ (96.1), లక్సెంబర్గ్ (96.0), ఫిన్లాండ్ (95.6), ఆస్ట్రేలియా (95.6)లు సూచీలో అత్యధిక స్కోరు సంపాదించిన దేశాలుగా నిలిచాయి.
- తొలిసారిగా దేశంలోని ప్రాంతాల మధ్య ఆరోగ్య సేవల తేడానూ పరిశోధకులు అంచనా వేశారు. చైనాలో గరిష్ఠ, కనిష్ఠ స్కోర్‌ల మధ్య తేడా 43.5 పాయింట్లుగా ఉంది. భారత్‌లో ఇది 30.8 పాయింట్లు. ❖

# 'మోదీ కేర్' (ఆయుష్మాన్ భారత్)కి కౌంట్‌డౌన్ ప్రారంభం

- సురేశ్ వెలుగూరి




స్వతంత్రం వచ్చి డెబ్భై ఏళ్లు దాటినా ఇప్పటికీ ప్రజలకు సరైన ఆరోగ్యం అందించలేని భారతదేశంలో ప్రజారోగ్య సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తమదైన పథకమంటూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ఒక భారీ స్కీంను ప్రకటించింది. 'ఆయుష్మాన్ భారత్' పేరుతో త్వరలో (బహుశా ఆగస్టు 15 నుంచి) అమల్లోకి రానున్న ఈ పథకాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్యస్కీంగా అభివర్ణిస్తున్నారు.

అయితే, అగ్రదేశాల స్థాయి పథకాలకు దీటైనదంటూ కేంద్రప్రభుత్వం రూపొందించిన ఈ పథకం విషయంలో పౌరసమాజం నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలకు కొన్ని నెలల వ్యవధి మిగిలివున్న సమయంలో కేంద్రం ప్రతిష్టాత్మకం అంటూ బయటికి తీసుకువచ్చిన ఈ ప్రాజెక్టును దేశవ్యాప్తంగా ఆరోగ్యరంగ నిపుణులు, మేధావులు, పాత్రికేయులు భిన్న కోణాల నుంచి నిర్వచిస్తున్నారు. ఇందులో పేర్కొన్న చాలా అంశాలు ఇప్పటికే వేర్వేరు పథకాల రూపంలో ప్రజలకు అందుబాటులో వుండగా, వాటి అనుసంధానంతోనే మరో పథకం అవసరం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. 'జాతీయ ఆరోగ్య మిషన్' పేరుతో 2005 నుంచీ అమల్లో వున్న పథకాన్నే మోడీ ప్రభుత్వం పేరుమార్చి కొత్త పథకమని తప్పుదోవ పట్టిస్తోందని వారు విమర్శిస్తున్నారు.

మరోవైపు, 'ఆయుష్మాన్ భారత్'ను అమలుపరచడానికి ఇప్పటికే 15కి పైగా రాష్ట్రాలు అంగీకరించాయి. దీనివల్ల ఏమాత్రం ప్రయోజనం లేదని తొలుత విమర్శించిన 'ఇండియన్ మెడికల్ అసోసియేషన్' (ఐఎంఏ) కూడా రెండు వారాల తర్వాత మనసు మార్చుకుని, ఇది దేశానికి ఉపయోగపడే పథకమేనని పేర్కొంది. ఆరోగ్యం, ఆర్థిక, సామాజిక రంగాల నిపుణులు కూడా ఈ పథకం వల్ల మిశ్రమ ప్రయోజనాలుంటాయని వ్యాఖ్యానిస్తున్నారు.

వీటన్నిటినీ అలా ఉంచి.. అందుబాటులో ఉన్న వివరాలు, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యం నుంచి 'ఆయుష్మాన్ భారత్'ను పరిశీలిద్దాం.

**ఆయుష్మాన్ భారత్ ...**

జాతీయ ఆరోగ్య భద్రతా పథకం 'ఆయుష్మాన్ భారత్'లో స్థూలంగా వున్న అంశాలు రెండు. వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు, ఆరోగ్యబీమా. ఈ పథకం కింద ఒక కుటుంబానికి ఏటా 5 లక్షల రూపాయల విలువైన వైద్య చికిత్సలకు హామీ లభిస్తుంది. దేశవ్యాప్తంగా పెద్దసంఖ్యలో వున్న ఆసుపత్రుల్లో ఎలాంటి చెల్లింపులూ లేకుండా వైద్యం చేయించుకోవడానికి వీలుంటుంది. ఈ పథకాన్ని తమ రాష్ట్రాల్లో అమలు చేయాలా,

వద్దా అని నిర్ణయించుకునే అధికారం ఆయా రాష్ట్రాలకుంటుంది. స్టేట్ హెల్త్ ఏజెన్సీ (ఎస్‌హెచ్‌ఎ) ఏర్పాటైవున్న ఏ రాష్ట్రమైనా దీనిని అమలు చేయవచ్చు. పథకం అమలులో రాష్ట్రాలతో అనుసంధానమయ్యేందుకు వీలుగా కేంద్రం 'ఆయుష్మాన్ భారత్ – నేషనల్ హెల్త్ ప్రొటెక్షన్ మిషన్ కౌన్సిల్' (ఎబి–ఎన్‌హెచ్‌పిఎంసీ)ని ఏర్పాటుచేస్తుంది. ఈ పథకం కింద రాష్ట్రాలకు అందాల్సిన నిధులు సక్రమంగా, సమయానికి అందేలా చూసేందుకు ఈ కౌన్సిల్ సాయపడుతుంది. పథకం అమలుతీరును నీతిఅయోగ్ పర్యవేక్షిస్తుంటుంది. కాగితం, డబ్బు అవసరం లేకుండా లబ్దిదారులకు దీని ప్రయోజనాలు అందించేందుకు నీతిఅయోగ్ ఒక పటిష్టమైన ఐటీ ప్లాట్‌ఫారాన్ని ఏర్పాటు చేస్తుంది. కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా ఈ పథకం వర్తిస్తుంది. రాష్ట్రాలు, యూటీలు ఏదైనా ఇన్సూరెన్స్ సంస్థ సాయంతో, లేదా ఒక ట్రస్టు ద్వారా పథకాన్ని అమలుచేయవచ్చు. దేశవ్యాప్తంగా 40% మంది పేద, అణగారిన వర్గాలకు ఈ పథకం ప్రయోజనకరమని కేంద్రం పేర్కొంటోంది. సోషియో ఎకనామిక్ కేస్ట్ సెన్సస్ (ఎస్ఈసీసీ) డేటా ప్రకారం 10.74 కోట్ల గ్రామీణ, పట్టణ ప్రాంత కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని లెక్కలు చెప్తోంది.

**పాత పథకాలు - కొత్త లక్ష్యాలు**

కేంద్రం పేర్కొన్న లక్ష్యాలు దేశప్రజలందరికీ ప్రయోజనకరమైనవే అనడంలో ఎలాంటి సందేహం లేదు. వీటిని నిర్బంధంగా ఆచరణలో పెట్టాల్సిన అవసరమూ వుంది. కానీ, ఇదే సమయంలో ఒక్కసారి ... ఇప్పటికే దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో అమల్లో వున్న ఆరోగ్యభద్రతా పథకాల్ని పరిశీలించడం కూడా అవసరం.

'ఆయుష్మాన్ భారత్' ఇస్తున్న రెండు ప్రధాన హామీలు – వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు, ఆరోగ్యబీమా. నిజానికి ఈ రెండూ ఇప్పటికే అమలులో వున్న అంశాలే. వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణ గురించి కేంద్రం ప్రకటించిన మార్గదర్శకాలను గమనిస్తే ... ఇప్పటికే దేశవ్యాప్తంగా వున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణకీ, వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణకీ ఏమాత్రం తేడా లేదనేది అర్థమవుతుంది. సాధారణ వైద్యం, సీజనల్ వ్యాధులు, వ్యవసాయం, జంతువుల కారణంగా వచ్చే వ్యాధులకు చికిత్స అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉపయోగపడుతున్నాయి. వెల్‌నెస్ సెంటర్ల ద్వారా కూడా ఇంతకుమించిన అదనపు ప్రయోజనాలేమీ లేవు. ఉన్న పీహెచ్‌సీలను సమర్థంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం వదిలిపెట్టి, కొత్త పథకాల్ని ప్రవేశపెట్టడం ఆరోగ్యరంగాన్ని మరింత కేంద్రీకృతం చేయడమే అవుతుంది. ఇది రాష్ట్రాల ప్రయోజనాలకు విరుద్ధమే కాక, ప్రజాధనాన్ని రెండువిధాలా దుర్వినియోగం చేసినట్లవుతుంది.

బీమా విషయంలో కూడా ఇదే పరిస్థితి. కుటుంబానికి రెండు నుంచి ఐదు లక్షల రూపాయల మేరకు ఆరోగ్యబీమా పథకాల్ని దాదాపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ, యూటీలూ ఇప్పటికే అమలుచేస్తున్నాయి. కుటుంబసభ్యుల సంఖ్యను నలుగురి నుంచి అపరిమితంగా పెంచడం కొత్త పథకంలో ప్రత్యేకాంశం. కానీ, రూ.ఐదులక్షల మొత్తం అలాగేవుండడం వల్ల కలిగే కొత్త ప్రయోజనాలేమీ లేవు. నిజానికి సగానికి సగం పైగా చికిత్సలకు ఇన్సూరెన్స్ సదుపాయం వర్తించదు. రోగి 24 గంటలు దాటి ఆసుపత్రిలో వుంటేనే బీమా సదుపాయం వర్తిస్తుంది. ఇప్పటివరకూ ఆరోగ్యబీమా పథకాలు కార్పోరేట్ ఆసుపత్రులకు, యాజమాన్యాలకు లబ్దిచేకూర్చడానికి ఎలా ఉపయోగపడుతున్నాయో 'ఆయుష్మాన్ భారత్' వల్ల జరిగేది కూడా ఇదే అవుతుంది. పైగా, కేంద్ర పథకం కాబట్టి, బీమా అవినీతి అడ్డుకట్ట వేయలేనంతగా పెరిగిపోతుంది.

**రాష్ట్రాల పథకాలతో అనుసంధానమెందుకు?**

మరొక మైనస్ పాయింట్ – ఆయా రాష్ట్రాల నిర్వహణలో వున్న పథకాలకు 'ఆయుష్మాన్ భారత్'ను అనుసంధానించేందుకు కేంద్రం అనుమతించడం. దీనివల్ల కలిగే ప్రయోజనమేమిటో కేంద్రం స్పష్టం చేయలేదు. ఒకే తరహా పథకాన్ని అమలుచేయడానికి ఒకవైపు రాష్ట్రం, ఇంకోవైపు కేంద్రం రెండు నిధుల్ని ఎందుకు విడుదలచేయాలి? 'ఆయుష్మాన్ భారత్' పేరుతో ఇప్పుడున్న పీహెచ్‌సీల స్థానంలో వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయడమంటే ... బోర్డులు మార్చడం తప్ప ఇంకోటి కాదు. ఎలాగూ పీహెచ్‌సీలకు రాష్ట్రాలు విడుదల చేస్తున్న డబ్బుంది కాబట్టి, 'ఆయుష్మాన్ భారత్' పేరుతో దానిని నిర్బంధంగా క్రమబద్ధీకరించడానికే కేంద్రం మొగ్గు చూపుతుంది తప్ప, కొత్త నిధుల్ని విడుదల చేయడానికి అంగీకరించదు. బీమా వర్తింపు కూడా ఇంతేవుంటుంది. కుటుంబసభ్యుల సంఖ్య విషయంలో కేంద్రం అస్పష్టతను ప్రదర్శించింది. కుటుంబసభ్యుల పరిమితిని తొలగించడం, ఏ ఒక్కరికైనా ఐదు లక్షల రూపాయల పూర్తి బీమాను తీసుకోవచ్చన్న మినహాయింపుల వల్ల బీమా ఏజెన్సీలు, ఆసుపత్రులు కుమ్మక్కయి, కుటుంబం స్థానంలో ఒక్క రోగి పైనే పూర్తిమొత్తాన్ని ఖర్చుగా రాసే ప్రమాదముంటుంది. ఈ తరహా ప్రమాదాలను నియంత్రించే సూచనలేవీ పథకం వివరణల్లో లేవు.

**చికిత్సే తప్ప నివారణకు చోటేదీ?**

నివారించదగ్గ జబ్బులను ఆదిలోనే గుర్తించి ముందస్తు చికిత్సను అందించడంపై 'ఆయుష్మాన్ భారత్' పథకంలో కనీస ప్రస్తావన కూడా లేదు. లక్షణం (సింప్టమ్) కనిపించగానే చర్యలు తీసుకోవడం ద్వారా అది వ్యాధి (డిసీజ్)గా మారకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన కూడా ప్రస్తావనల్లేవు. జబ్బుతో ఆసుపత్రికి చేరిన రోగికి మాత్రమే చికిత్స అందించడానికి ఈ పథకం పరిమితమైంది. ఇది ప్రమాదకరమైన సంకేతమని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. వైరల్ జ్వరాలు వ్యాపించే సమయంలో ఒక్క హైదరాబాద్ ఫీవర్ ఆసుపత్రికే రోజూ కనీసం మూడువేల మంది రోగులు వెళ్తుంటారు. ఇంతమందికి చికిత్స అందించేంత ఎక్కువ సదుపాయాలు అక్కడలేవు. ఇలాంటి సమయాల్లో తక్షణం స్పందించి, సదరు వైరస్‌లను నిర్మూలించాల్సిన బాధ్యత వున్న ప్రభుత్వ ఆరోగ్య విభాగాలు మిన్నకుండిపోవడం వల్ల ... జ్వరాల కారణంగా మరణిస్తున్నవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. 'ఆయుష్మాన్ భారత్' పథకంలో చికిత్సకే తప్ప, నివారణకు చోటివ్వకపోవడం వల్ల దీని ప్రయోజనాలు సన్నగిల్లిపోతాయి

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతానికి నిలబడాలి!**

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను రాష్ట్రప్రభుత్వాలు నిర్వహిస్తున్న తీరు అధ్వాన్నమని అందరూ ఒప్పుకుంటారు. మౌలిక సదుపాయాల లేమి, వైద్యులు, మందులు అందుబాటులో లేకపోవడం, చికిత్సల విషయంలో సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకునే వ్యవస్థలు లేకపోవడం, ప్రభుత్వ పథకాలను ఆరోగ్యరంగంతో అనుసంధానించడంలో వున్న లోపాలు ... ఇలాంటి అనేక అంశాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు స్ఫూర్తిని నీరుగారుస్తున్నాయి. దేశవ్యాప్తంగా 35 శాతం మంది ప్రజలు ఇప్పాటికీ కనీస ఆరోగ్య చికిత్సలకు దూరంగా వున్నారని అనేక ప్రభుత్వ నివేదికలే స్పష్టం చేస్తున్నాయి. అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు ప్రజారోగ్యం మీద అనేక పథకాల్ని అమలుచేస్తున్నప్పటికీ ఎందుకు కనీస ప్రమాణాల స్థాయికి చేరలేకపోతున్నామన్నది ఎలాంటి విస్మరణలు లేకుండా నిజాయితీగా పరిశీలించాల్సిన అంశం. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీలను బలోపేతం చేసుకోవడానికి కావల్సిన నిధుల్ని కేంద్రం ఆరోగ్య మంత్రిత్వశాఖ ద్వారా అందించి, వాటి అమలు తీరును నీతిఅయోగ్ సాయంతో పర్యవేక్షించగలిగినా మంచి ప్రయోజనాలు సాధ్యపడతాయి.

**'ఆయుష్మాన్ భారత్' అవసరం లేదని కాదు ...**

దేశ ఆరోగ్య వ్యవస్థను చక్కదిద్దడానికి 'ఆయుష్మాన్ భారత్' లాంటి పథకాలు ఖచ్చితంగా అవసరమే. కానీ, అది పార్టీల రాజకీయావసరాల నేపథ్యం నుంచి బయటికి రావడమే సమస్య. 2004లో లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ కేంద్రప్రభుత్వానికి సమర్పించిన 'జాతీయ ఆరోగ్య మిషన్ ముసాయిదా'ను కొన్ని పరిమితులతో నాటి యూపీఏ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. అభివృద్ధి చెందిన, చెందుతున్న, చెందాల్సిన దేశాల్లో ప్రజారోగ్య భద్రత విషయంలో ప్రభుత్వాలు పాటించాల్సిన ప్రమాణాలను ఆ ముసాయిదా విస్పష్టంగా పేర్కొంది. ఇటువంటి ప్రజాముసాయిదాల్ని పక్కనపెట్టి ఆచరణ సాధ్యం కాని, హేతుబద్ధత లేని కొత్త చట్టాల్ని ప్రతిపాదించడం ద్వారా కేంద్రప్రభుత్వం ఒకపెద్ద అపమార్పుకు కారణం కాబోతోందని ఆరోగ్య, ఆర్థిక రంగాల నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్యభద్రతా స్కీమ్ అవుతుందని మోడీ ప్రభుత్వం చెప్తోందని, నిర్వహణ లోపాలు తలెత్తితే ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్యభద్రతా స్కామ్ అవుతుందని కూడా వారు హెచ్చరిస్తున్నారు.

ఈ నేపథ్యంలో 'ఆయుష్మాన్ భారత్' పథకం గురించి పౌరసమాజం, నిపుణుల అభిప్రాయాల్ని పరిగణనలోకి తీసుకుంటూ, సందేహాల నివృత్తికి కేంద్రం నడుం బిగించగలిగితే దీని అమలు సుసాధ్యమవుతుంది. ఒకవైపు కొత్త పథకాన్ని అమలుచేస్తూనే, పాత వ్యవస్థల్ని మరింత బలోపేతం చేయడానికి అవసరమైన చర్యల్ని కూడా ఇందులో భాగం చేయగలిగితే 'ఆయుష్మాన్ భారత్' నిజంగానే భారతీయుల ఆయుష్షుకు దోహదం చేస్తుంది, లేదంటే అది భారతీయులపై పెనుభారమవుతుంది.

❖

# 18 నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జులై 18 నుంచి ఆగస్టు 10 వరకు నిర్వహించనున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ తెలిపారు. దాదాపు 18 పనిదినాల పాటు సమావేశాలు జరుగుతాయి. వర్షాకాల సమావేశాల సందర్భంగా 6కి పైగా ఆర్డినెన్సులను, పలు కీలక బిల్లులను పార్లమెంటు ముందు ఉంచాలని ప్రభుత్వం ఎజెండాను రూపొందించింది.

❖

# ఖజానా ఖాళీ చేయటం తప్ప ప్రజలకు ఆరోగ్యాన్ని అందించలేని 'ఆయుష్మాన్ భారత్'




**ఓట్ల కోసమైనా, మరో కారణం రీత్యా అయినా కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం మరికొన్ని రోజుల్లో దేశవ్యాప్తంగా అమలుచేయనున్న ఆయుష్మాన్ భారత్ స్కీం.. ఆరోగ్య రంగంలో ఓ పెద్ద ముందడుగు అనటంలో సందేహం లేదు. పౌష్టికాహారాన్ని అందించటం, విద్యావ్యవస్థలో ఆరోగ్య బోధనను చేర్చటం వంటివి ఇందులో భాగం చేయటం ఆహ్వానించదగ్గదే. కానీ పునాది స్థాయి నుంచి రూపకల్పన సరిగా లేకుండా, నిధుల కేటాయింపుపై అంచనా లేకుండా, ఇచ్చిన నిధుల్ని కూడా అసంబద్ధంగా ఖర్చు చేసే రీతిలో ఆయుష్మాన్ భారత్‌ను రూపొందించారు. దీనివల్ల ఆ స్కీం భారీ వైఫల్యాల జాబితాలో చేరిపోయే ప్రమాదముంది. అయినా కూడా.. విప్లవాత్మక పథకమన్నట్టు పాలకులు డాబుసరిగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇది ప్రజలను బ్లఫ్ చేసే రాజకీయ క్రీడే అవుతుంది.**

కొన్నివారాల క్రితం ఓ ప్రముఖ తెలుగు దినపత్రిక ఆదివారం అనుబంధంలో ఒక కథనం ప్రచురితమైంది. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక వీడియో నుంచి రూపొందించిన న్యూస్ స్టోరీ అది. మన వైద్య ఆరోగ్య వ్యవస్థలోని ఓ పెద్ద వైఫల్యానికి, భారత ప్రభుత్వం త్వరలో (2018 స్వాతంత్ర్య దినోత్సవం నుంచి కార్యాచరణలోకి తేవాలని ప్రధాని మోదీ పట్టుదలతో ఉన్నారు) అమలుపరచనున్న 'ఆయుష్మాన్ భారత్' (జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం/మోదీ కేర్) స్కీంలోని ప్రధాన లోపానికి ఆ కథనం అద్దం పడుతుంది.

ఈ లోపాన్ని సురాజ్య యాత్రలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ కూడా పలుమార్లు తెలియచేశారు. సండే మ్యాగజైన్ కథనం మరో తాజా హెచ్చరిక!

చాలామంది ఇప్పటికే ఈ కథనాన్ని చదివేసి ఉండొచ్చు. యూట్యూబ్‌లో కూడా చూసేసి ఉండొచ్చు. అయినా, అందులోని లోతైన అంశాన్ని చర్చనీయాంశం చేసేందుకు.. రిపోర్టును క్లుప్తంగా ఇక్కడ ప్రస్తావిస్తున్నాం.

*''ఎనిమిదేళ్ల కిందట.. ఒడిషాలోని నవరంగ్‌పూర్ జిల్లా, తెంతులికుంతి గ్రామంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్.. చూడ్డానికి పాడుబడిన భవనంలా ఉండేది. ఒకరిద్దరు తప్ప డాక్టర్లూ ఉండేవారు కాదు. అనారోగ్యంతో ఆస్పత్రి మెట్లెక్కిన రోగులు సరైన వైద్యం అందక నానా ఇబ్బందులూ పడేవారు. అప్పుడే భువనేశ్వర్‌కి చెందిన 24 ఏళ్ల కిషోర్‌చంద్ర దాస్ ప్రభుత్వ వైద్యుడిగా అక్కడికి వచ్చాడు. నిజానికి ఆ మారుమూల ప్రాంతంలో పనిచెయ్యడానికి డాక్టర్లెవరూ ముందుకొచ్చేవారు కాదు. ఆరుగురు వైద్యులు ఉండాల్సిన ఆస్పత్రిలో కిషోర్ వచ్చేసరికి ఒక్క ఫార్మసిస్ట్ మాత్రమే ఉన్నారు. ఎప్పుడైనా ఒకరిద్దరు వైద్యులు వచ్చినా సరైన వైద్యం అందించకపోవడంతో గ్రామస్తులూ ఆస్పత్రికి రావడం*

తగ్గించేశారు. కానీ కిషోర్ వచ్చిన కొద్దిరోజుల్లోనే ఆస్పత్రి రూపురేఖలు మారిపోయాయి. మొత్తం శుభ్రం చేయించి, రిపేర్లు చేయించడంతోపాటు అన్నిరకాల వైద్యసదుపాయాలూ అందించేందుకు ఏర్పాట్లు చేయించడం మొదలుపెట్టాడు. ఎక్కడైనా చెత్త కనిపిస్తే తనే చీపురు పట్టుకుని ఊడ్చేవాడు. అతడి నిబద్ధతతను చూశాక సిబ్బంది పనితీరూ మెరుగుపడింది. వీటన్నిటినీ మించి ఆయనో మంచి వైద్యుడు. దాంతో కొద్దిరోజుల్లోనే 'ఈ డాక్టర్ అందరిలా కాదు' అనే నమ్మకం ప్రజల్లో ఏర్పడింది. ప్రైవేటు ఆస్పత్రుల్లో వేల రూపాయలు ఖర్చుపెట్టినా తగ్గని రోగాలు ఆయన వైద్యానికి తగ్గుతుండడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా వంద కిలోమీటర్ల దూరం నుంచి కూడా రోగులు తెంతులికుంతికి వచ్చేవారు. అలా రోగుల సంఖ్య రోజుకి 150మందికి మించిపోయేది. ఫార్మసిస్టు సహకారంతో రెండేళ్లపాటు తనొక్కడే అన్ని కేసుల్నీ చూశాడు. అయినా ఎప్పుడూ ఎవరిమీదా విసుక్కున్న దాఖలాలు లేవు. రోగులతో ఎంతో ప్రేమగా మాట్లాడేవాడు. 'ప్రభుత్వ ఆస్పత్రుల్లో గంటా రెండుగంటలు ఎక్కువ పనిచేస్తేనే గొప్ప. అలాంటిది మా డాక్టర్‌గారు రాత్రీపగలు తేడా లేకుండా వైద్యం చేసేవారు. ఆయన రోగుల కోసం భోజనం మధ్యలో వదిలేసి పరిగెట్టిన సందర్భాలు ఎన్నో' అంటూ ఆయనతో తమకున్న అనుభవాల్ని పంచుకుంటారు గ్రామస్తులు.

"కిషోర్‌కి ముందు ఆస్పత్రి అభివృద్ధి కోసం వచ్చిన నిధులు ఏమయ్యాయో తెలీదు.. కానీ అతడొచ్చాక హాస్పిటల్‌కు ఆపరేషన్ థియేటర్, ఆక్సిజన్ కాన్‌సంట్రేటర్, హాస్పిటల్ ఆవరణలోకి సీసీ కెమేరాలూ




సోలార్ బల్బులతోపాటు ఇతర వైద్యసామాగ్రీ సమకూరాయి. ప్రసవ సమయంలో తల్లుల సేదతీర్చేందుకు ప్రసూతి గదిలో ఏసీని ఏర్పాటు చేయించిన ఈ డాక్టర్ తన గదికి మాత్రం ఏసీ పెట్టించుకోలేదు. అతడి చొరవ వల్లే తర్వాత ఆస్పత్రికి ఐదుగురు కొత్త వైద్యులు వచ్చారు. కిషోర్ సారథ్యంలో వాళ్లూ మంచి వైద్యులుగా పేరు తెచ్చుకున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో కొన్నిసార్లు రోగులకు కావల్సిన మందులు దొరకకపోవడం సాధారణమే. అలాంటపుడు మందులు బయట కొనుక్కోవడానికి డబ్బుల్లేవని ఎవరైనా బాధపడితే తన డబ్బులతో కొనిచ్చేవాడు కిషోర్. ఇంకేముందీ.. ఈ డాక్టర్‌బాబు స్థానికులకు ముద్దుబిడ్డలా మారిపోయాడు. ఆస్పత్రిలోని మిగిలిన స్టాఫ్‌కూ అతడండే అమితమైన ప్రేమ.

"ఎనిమిదేళ్లు గడిచాయి. వృత్తిలో నైపుణ్యం సాధిస్తే ఇంకా ఎంతోమందికి సేవ చేయొచ్చు అనే ఆలోచనతో ఆర్థోపెడిక్స్‌లో పీజీ చెయ్యడానికి భువనేశ్వర్ వెళ్లాలనుకున్నాడు కిషోర్. అలా అతడు తెంతులికుంతిని వదిలి వెళ్లాల్సిన రోజు రానే వచ్చింది. ఆరోజున ఊరు ఊరంతా డాక్టర్ ఇంటిముందు చేరింది. 'మమ్మల్ని వదిలి వెళ్లద్దు సారూ' అంటూ కన్నీళ్లతో కాళ్లు కడిగారు జనం. ఆ ప్రేమను చూసి కిషోర్‌కూ దు:ఖం పొంగుకొచ్చేసింది. 'ప్రాణాలను నిలబెట్టే వైద్యులు దేవుళ్లతో సమానం అని చెప్పేవారు మా అమ్మానాన్నా. ఇప్పుడు ఈ జనం నన్నలాగే చూస్తున్నారు. అది చాలు నాకు. వీలైతే మళ్లీ వస్తా'నంటూ మాట ఇచ్చి బాధతోనే వీడ్కోలు పలికాడు. దాంతో మేళతాళాలతో పూలవర్షం కురిపిస్తూ వందలమంది పక్కఊళ్లో ఉన్న బస్టాండ్ వరకూ వెళ్లి అతడిని సాగనంపారు. ఈ తతంగాన్నంతా స్థానికంగా ఉండే తెలుగమ్మాయి కృష్ణప్రియ వీడియో తీసి స్నేహితుల గ్రూప్‌లో షేర్ చేశారు. అంతే, ఈ మనసున్న డాక్టర్ కథ సోషల్ మీడియాలో వైరల్ అయిపోంది. 'ఆ ఆస్పత్రి ఎదురుగా నేను మందుల షాపు నిర్వహిస్తున్నా. కిషోర్ తన దగ్గరికి రాలేని మారుమూల ప్రాంత ప్రజల దగ్గరికి తనే వెళ్లి వైద్యం చేసేవారు. పిల్లలకు వ్యాక్సిన్లు వేయించేవారు. ఓసారి కొండల మధ్యలో సరైన రోడ్డు సదుపాయం కూడా లేని తల్లంగ అనే గ్రామానికి వారి బృందంతోపాటు నేనూ వెళ్లా. అక్కడ కరెంటు కూడా లేదు. అది తెలిసి ఆయన వెంటనే ఊరి మొత్తానికీ సోలార్ ల్యాంపుల్ని అందించారు. ఇలా చెప్పాలంటే ఎన్నో ఉన్నాయి' అంటూ కిషోర్ గురించి చెబుతారు కృష్ణప్రియ.

"నిజంగా ఈ డాక్టర్ ధన్యుడు కదూ.." అంటూ కథనం ముగుస్తుంది.

...ఈ డాక్టర్ ధన్యుడు అనటంలో ఎటువంటి సందేహం లేదు. నిజమైన సెలబ్రిటీ ఇతను. నిజమైన సెలబ్రేషన్ ఇతని కెరీర్, జీవితం! తాము ఉండే చోట సమస్యల్ని కాస్త అవగాహన చేసుకుని, కొద్దిపాటి బాధ్యత తీసుకునే నాయకత్వ లక్షణాలున్న యువత ఉంటే ఎంత పెద్ద మార్పుల్ని చేయొచ్చో డాక్టర్ కిషోర్ నిరూపించారు. ఇదో పార్శ్వమైతే.. మన వైద్యవ్యవస్థలోని ఓ పెద్దలోపాన్ని కూడా ఈ కథనం వెల్లడిస్తుంది.

సరైన వైద్యవిధానం అనేది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి మొదలవుతుంది. ప్రాథమిక ఆరోగ్య స్థాయిలో విఫలమైతే, ఆ వైద్యవిధానం కూడా పునాదిలేని భవనంలా కూలిపోతుంది. పునాదుల పైన కూడా భవన నిర్మాణానికి చాలా చేయాల్సుంటుంది, ప్రాథమిక ఆరోగ్యంతో పాటు ద్వితీయ, తృతీయ స్థాయి వైద్యానికి కూడా ఆధునిక సదుపాయాలతో ఏర్పాట్లు అవసరమే. కానీ ప్రైమరీ హెల్త్ సెంటర్లు సరిగా పనిచేయకుండా.. పైన ఎంత గొప్ప వైద్యాన్ని అందించినా ప్రజలకు ఆరోగ్యం అందదు. ప్రాథమిక స్థాయిలో వైద్యాన్ని అందించేందుకు హెల్త్ సెంటర్లు ఉన్నా కూడా ప్రజలు ఉపయోగించు కోకుండా జిల్లా స్థాయిలోని పెద్దాస్పత్రులకే వస్తున్నారని, తమ తప్పేమీ లేదని కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న మన ప్రభుత్వాలు తప్పించు కోజూస్తున్నాయి. ప్రజలు పైస్థాయి ఆస్పత్రులకే వస్తున్నారు కాబట్టి తాము కూడా కార్పొరేట్ హంగులతో పైస్థాయి వైద్యానికే ప్రాధాన్యత ఇస్తూ ఆరోగ్యరంగంలో విప్లవాత్మక మార్పుల్ని ప్రవేశపెడుతున్నట్టు భ్రమ కల్పిస్తున్నాయి. దగ్గర్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఉన్నా కూడా ప్రజలు సాధారణ జ్వరాలకు, చిన్న అనారోగ్యాలకు ఎందుకు వాటిని వినియోగించుకోవటం లేదు? అన్న మౌలిక ప్రశ్నకు సమాధానమివ్వకుండా పాలకులు తప్పించు కుంటున్నారు. ఈ ప్రశ్నకు సరైన సమాధానం వస్తే తప్ప సరైన ఆరోగ్య వ్యవస్థ రూపుదిద్దుకోదు.

### మంత్రి డాక్టరైనంత మాత్రాన, అధికారి ఐఏఎస్ అయినంత మాత్రాన చాలదు

తెలుగు రాష్ట్రాల్లో, కేంద్రంలో కూడా పలువురు డాక్టర్లు వైద్య ఆరోగ్య శాఖా మంత్రులుగా పనిచేశారు. అయినా ఆరోగ్యం ఉన్నకొద్దీ ప్రజలకు పెనుభారమవుతోంది. పేద, మధ్యతరగతివారు చిన్నపాటి అనారోగ్యం వస్తేనే వణికిపోవాల్సి వస్తోంది. పేరుకు ఉచిత స్కీములున్నా.. వాటి ద్వారా నాసిరకం వైద్యమే అందుతోంది. కేవలం డాక్టర్ చదవటమొక్కటే చాలదు, కేవలం ఐఏఎస్ అయితేనే చాలదు.. దేశానికి పనికొచ్చే వైద్య ఆరోగ్య విధానాన్ని రూపొందించాలంటే సామాజిక, ఆర్థిక రంగాలపై సమగ్ర అవగాహన, ప్రజాప్రయోజనాల పట్ల దూరదృష్టి ఉన్న నాయకులు, ఉన్నతాధికారులు అవసరమని అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి.

### వైద్యులు కూడా 'అందరికీ ఆరోగ్యం' విధానం కోసం కృషి చేయాలి

ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందలేదంటూ వైద్యుల మీద దాడులు కూడా ఇటీవల పెచ్చరిల్లుతున్నాయి. వైద్యులకు-రోగులకు మధ్య విశ్వాసం దెబ్బతినటం వల్ల ప్రజలు మరింత నష్టపోతారనేది వాస్తవమే అయినా, ప్రజల సమస్యల్ని పట్టించుకోకపోవటం వల్లే తమకు తగిన గౌరవం, ఆర్థిక లాభాలు లభించటం లేదని వైద్యులు కూడా గుర్తించాలి. తమకు, రోగులకు మధ్య తంపులు పెంచుతున్నది ప్రభుత్వ ఆరోగ్య విధానమేనని తెలుసుకోవాలి. ప్రజల ఆర్థిక భారం లేకుండా వారికి నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించే హెల్త్ పాలసీ కోసం వైద్యులు కూడా కృషి చేయాలి. హెల్త్ ఫర్ ఆల్ అనే వ్యవస్థ ఇండియాలో ఏర్పడినప్పుడే వైద్యుల సమస్యలు కూడా పరిష్కారమవుతాయి.

### భరోసా లేకపోవటం వల్లే..

వైద్యరంగంలో నమ్మకం కీలకం. ప్రాథమిక స్థాయి వైద్యానికి ఉద్దేశించిన ఆరోగ్య కేంద్రాల్లో మందులు, వైద్యం సరిగా అందవనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. తనకో, ఇంట్లోవారికో ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే.. తనకు దగ్గర్లో ఉన్న ఆరోగ్య కేంద్రానికి వెళ్లటం కన్నా దూరంగా జిల్లా కేంద్రంలో మెరుగైన వైద్యసదుపాయాలున్న ఆస్పత్రికి వెళ్లటానికే అత్యధికులు మొగ్గు చూపుతున్నారు.

ఆరోగ్యం, విద్య విషయంలో తన కులానికి చెందిన డాక్టర్ దగ్గరకో, టీచర్ దగ్గరకో వెళ్లటానికి కూడా ఎవరూ ఇష్టపడరు. ఎందుకంటే, మన జీవితాలకి అంత ముఖ్యమైన రంగాలవి. మరి ప్రజలకు భరోసా కల్పించేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం ఎందుకు తీర్చిదిద్దడం లేదు? వాటిని మెరుగుపరిస్తే, చుట్టుపక్కల ప్రజలంతా అక్కడికే వస్తారు, పెద్దాస్పత్రుల మీద భారం తగ్గుతుంది, చాలా డబ్బు కూడా ఆదా అవుతుంది.

ఇలా కమ్యూనిటీ, ప్రైమరీ హెల్త్ సెంటర్లను బాగు చేయడానికి నిపుణులైన వైద్యుల నియామకం కీలకం. అక్కడి వైద్యుడు లేదా వైద్యురాలు గనుక ప్రజల్లో నమ్మకాన్ని కలిగించగలిగితే.. జనం వద్దన్నా అక్కడికే వచ్చి వైద్యం చేయించుకుంటారు. తెంతులికుంతిలో జరిగిందదే. కిషోర్‌చంద్ర దాస్ అనే వైద్యుడి విజయరహస్యమదే. ఎక్కడో జిల్లా స్థాయిలోని

**ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లు, ఉపన్యాసాలతో ఎల్లకాలం దృష్టి మళ్లించలేరు**

విరాట్ కోహ్లీలాంటివారితో కలిసి ప్రధానమంత్రి మోదీ, కేంద్రమంత్రులు ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లు చేసుకుంటూ ఆరోగ్యంపై ఉపన్యాసాలు ఇస్తూ ఎల్లకాలం జనం దృష్టి మళ్లించలేరు. ఆరోగ్యం ప్రతి ఇంటికీ ఎలా అందుతుందో స్పష్టమైన ఆలోచనతో విధానాన్ని రూపొందించి అందించాలి. ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లు విసురుకుంటున్నా, తమకేదైనా ఆరోగ్యపరమైన తేడా చేస్తే 'ఎయిమ్స్' వంటి అత్యున్నత వైద్యసంస్థల్లోనే సేవల్ని పొందుతున్నా.. మన నాయకులు ఫిట్‌నెస్‌లో ప్రపంచ స్థాయిలో దిగువనే ఉన్నారు. మేక్రాన్, పుతిన్, చివరికి వయసుడిగిన ట్రంప్ కూడా మన నాయకుల కంటే ఫిట్‌గా ఉంటారు. నానాగడ్డీ కరిచి నల్లడబ్బు పోగేయటం, ఎన్నికల్లో ఆ డబ్బుతో ఓట్లు కొనడం, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టకుండా బ్రోకర్లలా వ్యవహరిస్తూ నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల్ని చేసి పెట్టి ఓటు అడగటం వంటివి మానేసి, పౌర సేవల చట్టం, దామాషా పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి సంస్కరణలతో అధికారాన్ని ఓ మార్గంగా మాత్రమే గుర్తించి తమ బాధ్యతలకు పరిమితమైతే.. మన నాయకులు కూడా ఫిట్‌నెస్‌ని పెంచుకోగలుగుతారు.

పెద్దాస్పత్రిలో వైద్యం కోసం శ్రమకోర్చి వెళ్లాల్సిన అవసరం లేకుండా, దగ్గర్లోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలోనే చక్కటి వైద్యం లభిస్తుందనే భరోసాను అతను ఇవ్వగలిగారు. దీంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. భరోసా లేకపోవడమనే లోపమే భారత ఆరోగ్య వ్యవస్థను పట్టిపీడిస్తోంది.

ఈ అంశాలన్నిటినీ డా॥ జయప్రకాష్ నారాయణ్ పదేపదే వివరిస్తున్నారు. సురాజ్య యాత్రలో భాగంగా పలు జిల్లా ఆస్పత్రులను, ఏరియా హాస్పిటళ్లను, పీహెచ్‌సీలను జేపీ సందర్శించారు. "ఏ పనీ లేని పలు పోస్టులను కొనసాగిస్తూ లక్షల రూపాయల జీతాల్ని వృధాగా ఇస్తున్న ప్రభుత్వం.. ప్రాణాల్ని కాపాడే వైద్యరంగంలో సేవలందించే డాక్టర్లకు, నర్సులకు, ఇతర సిబ్బందికి కనీస గౌరవప్రదమైన జీతాలివ్వడం లేదు. వైద్యులు గ్రామాల్లో ప్రాక్టీస్‌కు వెళ్లటానికి ఇష్టపడటం లేదంటూ కట్టుకథలు చెప్పి దాటవేస్తోంది. ప్రభుత్వం కొద్దిపాటి అదనపు నిధుల్ని కేటాయించి ప్రజల్లో భరోసా కలిగించేలా స్థానికంగా నిబద్ధతగల వైద్యుల్ని అందుబాటులో ఉంచగలిగితే, అద్భుతమనదగ్గ రీతిలో వైద్యసేవలు అందటం ప్రారంభమవుతుంది. ఈ రంగంలో ప్రభుత్వం పెట్టే ప్రతి రూపాయికీ ఐదు రెట్లు, పది రెట్లు ఫలితం లభిస్తుంది. ప్రభుత్వం వనరుల్ని సరిగా ఇవ్వకపోయినా.. రోజూ వందలాది పేషెంట్లను చూస్తూ ప్రభుత్వం ఇచ్చే నిధులకు అనేక రెట్లు ఫలితమిస్తున్న డాక్టర్లను నేను స్వయంగా చూశాను, విజయనగరం జిల్లాలోని పార్వతీపురం, అనంతపురం పట్టణం, జిల్లాలోని రాయదుర్గంలోని ఆస్పత్రుల్లో వైద్యులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయంగా ఉన్నాయి" అని జేపీ పలు చోట్ల వివరించారు.

**దిద్దుబాటు లేకుండానే 'వెల్‌నెస్' సెంటర్లు**

దేశ ప్రాథమిక ఆరోగ్య రంగంలోని ఈ లోపాన్ని కొనసాగిస్తూనే కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ స్కీంను తీసుకొస్తోంది. అందుకే వైఫల్యం పొంచి ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య కార్యక్రమంగా చెప్పబడుతున్న ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా.. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు, రాష్ట్రాల భాగస్వామ్యంతో దేశ జనాభాలో 40-50 కోట్ల మందికి రూ.5 లక్షల దాకా ఉచిత వైద్య సౌకర్యాన్ని అందించాలని ప్రతిపాదించారు. వ్యాధి చికిత్స కన్నా నివారణ మేలన్న సూత్రాన్ని, ప్రాథమిక వైద్యం ప్రాధాన్యతను తమకు తోచినట్టు అర్థం చేసుకుని లక్షన్నర 'వెల్‌నెస్' సెంటర్లను ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే ఈ వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణ గురించి ఎటువంటి కొత్త ఆలోచనా చేయలేదు. అంటే ఇప్పుడున్న ప్రాథమిక స్థాయి ఆరోగ్య కేంద్రాల్లానే అవి నడుస్తాయన్న మాట (తెలుగునాట ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించిన కొన్ని వెల్‌నెస్ సెంటర్లు అనారోగ్యం పాలై అలంకార ప్రాయంగా పడివున్నాయి).

ఇక ప్రాథమికానికి పైన స్థాయిలోని వైద్యానికి.. ప్రైవేటు భాగస్వామ్యంతో హంగులద్దే ప్రయత్నం చేస్తున్నారు. బీమా కంపెనీలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి పేద రోగులకు రూ.5 లక్షల దాకా వైద్యఖర్చులు అందించే ఏర్పాటు చేస్తున్నారు. ఈ మొత్తంలో కూడా.. ప్రభుత్వ వెల్‌నెస్ సెంటర్లు సక్రమంగా పనిచేయకపోవటం, ఆరోగ్యశ్రీలో జరిగినట్టే ద్వితీయ, తృతీయ స్థాయి వైద్యం పేరుతో ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు లాభాలార్జించటం మాత్రమే జరిగే అవకాశాలున్నాయి. ప్రభుత్వాస్పత్రులు కొంత మెరుగుపడి, కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు నిజాయతీగా సేవలందిస్తున్నాయి అనుకున్నా కూడా.. ప్రాథమిక స్థాయిలో సరైన వైద్యం అందక జబ్బు ముదరబెట్టుకుని అనవసరంగా ఆస్పత్రుల పాలయ్యే వారి సంఖ్య పెరుగుతూనే ఉంటుంది తప్ప తగ్గదు. ఏతావాతా, కోట్ల మందికి ఆరోగ్యం అందిస్తున్నామని ప్రభుత్వం చాటింపు వేసుకుంటుంటుంది, ప్రభుత్వ ఖజానాకు ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బు ఖర్చవుతుంటుంది.. కానీ ప్రజలకు మాత్రం సరైన ఆరోగ్యం అందదు!

## ఫ్యామిలీ డాక్టర్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలి, ప్రాథమిక వైద్య కేంద్రాలతో వారిని అనుసంధానం చేయాలి

వెల్‌నెస్ సెంటర్లు సహా ప్రాథమిక స్థాయిలోని వైద్య కేంద్రాల పట్ల ప్రజల్లో విశ్వాసం కలిగి సరైన వైద్యసేవలు అందుబాటులోకి రావాలంటే.. ప్రభుత్వాలకు లోక్‌సత్తా ఇప్పటికే లిఖిత పూర్వకంగా, మౌఖికంగా తెలియజేసినట్టు ఫ్యామిలీ డాక్టర్‌తో వాటిని అనుసంధానించాలి. ప్రాథమిక వైద్య కేంద్రాల ద్వారా ప్రజలకు తొలి కాంటాక్ట్ పాయింట్‌గా 'ఫ్యామిలీ ఫిజీషియన్' అందుబాటులో ఉంటారు. ప్రతి కుటుంబానికీ ఒక 10మంది డాక్టర్ల ప్యానల్‌ను ఇవ్వాలి. అందులో తమకు నచ్చిన డాక్టర్‌ని ఆ కుటుంబం ఎంచుకుంటుంది. వారి ఆరోగ్య పరిరక్షణ బాధ్యత ఇక ఆ ఫ్యామిలీ ఫిజీషియన్‌దే. ఆయన సిఫారసు చేస్తేనే (అత్యవసర పరిస్థితుల్లో మినహాయించి) ద్వితీయ, తృతీయ శ్రేణి ఆస్పత్రులు ఏ రోగినైనా అనుమతిస్తాయి. దీనివల్ల తన చుట్టుపక్కల ఉన్న హెల్త్ సెంటర్ల ద్వారా కూడా తమకు మంచి వైద్యం అందుతుందన్న భరోసా, వృధాగా పెద్దాస్పత్రులు దోపిడీ చేయవన్న విశ్వాసం ప్రజల్లో కలుగుతుంది. ఎన్ని కుటుంబాలు ఎంచుకుంటాయన్నది లెక్క గట్టి, ఫ్యామిలీ ఫిజీషియన్‌కి ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి ఇంతని డబ్బు చెల్లిస్తుంది. దీనివల్ల నెలకు రూ. 1,00,000-2,00,000 కనీస ఆదాయం ప్రతి డాక్టర్‌కీ వచ్చే అవకాశముంది. సామర్థ్యం ఉంటే ఇంకా పెరగవచ్చు. వెల్‌నెస్ సెంటర్లు కూడా ప్రత్యేకించి అక్కర్లేదు. డాక్టర్లు తమను ఎంచుకున్న కుటుంబాలకు ఆరేడు కిలోమీటర్ల దూరంలోనే సొంతంగా క్లినిక్‌లను నడుపుకుంటూ సేవల్ని అందించవచ్చు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌లకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా అక్కర్లేదు. ఎంబీబీఎస్‌లకు (ఓ పక్క డాక్టర్లకు డిమాండ్ ఉండగా, మరోపక్క వేల మంది ఎంబీబీఎస్‌లు సరైన ఆదాయం లేకుండా ఉన్న విచిత్రమైన పరిస్థితి తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో నెలకొని ఉంది) కొద్దిపాటి శిక్షణనిచ్చి వారి సేవల్ని వినియోగించుకుంటే చాలు. మారుమూల ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలుగా పిలవబడుతున్న అన్‌క్వాలిఫైడ్‌ల సేవల్ని కూడా ఎంబీబీఎస్ డాక్టర్ల ఆధ్వర్యంలో ఉపయోగించుకోవచ్చు.

భవిష్యత్తులో వెల్‌నెస్ సెంటర్లను కృత్రిమ మేధతో అనుసంధానం చేయాలని, రోబోటిక్ సేవలతో ప్రాథమిక వైద్యాన్ని అందించే అవకాశముంది కాబట్టి ప్రాథమిక వైద్య కేంద్రాల్ని సరైన సిబ్బంది లేకుండా కూడా నడిపేయొచ్చనే వాదనలు కూడా పాలకవర్గాల నుంచి వినిపిస్తున్నాయి. అయితే డాక్టర్‌కి-పేషెంట్‌కి మధ్య నమ్మకం అనేది వైద్యానికి కీలకం, ఆ నమ్మకానికి డాక్టర్ ద్వారా పేషెంట్‌కు అందే హీలింగ్‌టచ్ కీలకం! యాంత్రికంగా చూసే డాక్టర్ వద్దకంటే.. చేయి పట్టుకుని నాడిని చూసి ఎటువంటి పరికరాలూ లేకుండానే రోగాన్ని ప్రాథమికంగా డయాగ్నైజ్ చేసే డాక్టర్ వద్దకే వెళ్లాలని ప్రజలు భావిస్తారు. అటువంటి డాక్టర్ దగ్గరికి వెళ్తే సగం జబ్బు తగ్గిపోయినట్టు ఫీలవుతారు. టెలీ మెడిసిన్, రోబోటిక్ సేవల పరిమితిని గుర్తించి ఫ్యామిలీ ఫిజీషియన్ వ్యవస్థ పునాదిగా వైద్య విధానాన్ని అమలు చేయటం శ్రేయస్కరం.

### సరైన పాలన.. ప్రజలకు యోగా కంటే ఎక్కువ ప్రశాంతతనిస్తుంది

ప్రజలు యోగా, ధ్యానం చేసుకుంటూంటే ప్రశాంతంగా ఉంటారని, అప్పుడసలు అనారోగ్యంతో ఆస్పత్రుల పాలవ్వాల్సిన పరిస్థితి కూడా ఉండదని, దీంతో వైద్య బిల్లులు భారీగా తగ్గుతాయని పాలకులు లెక్కలేస్తున్నట్టుంది. యోగా, ధ్యానం వంటి వాటి ప్రాధాన్యతను గుర్తించాల్సిందేగానీ.. చట్టబద్ధపాలన లేకుండా, సరైన విద్య, ఉపాధి లేకుండా, పాలనా వికేంద్రీకరణ లేకుండా, అవినీతిని ఆపకుండా ప్రజలు బీపీ బారిన పడకుండా ఎలా ప్రశాంతంగా ఉండగలరన్న ఇంగితజ్ఞానం ఉండాలిగా!

## 90 శాతం మంది అసంఘటిత రంగంలో ఉన్న దేశంలో బీమా ఆధారిత వైద్య వ్యవస్థ సరికాదు

అలాగే దాదాపు 90 శాతం మంది అసంఘటిత రంగంలో ఉన్న మనదేశంలో బీమా ఆధారిత వైద్య వ్యవస్థ సరైనది కాదు. ఈ లోపాన్ని కూడా ప్రభుత్వం సరిదిద్దాలి.

లోక్‌సత్తా చెప్పింది బ్రిటన్ నమూనా ఆరోగ్య పథకమైతే, ఆయుష్మాన్ భారత్‌లోని బీమా ఆధారిత వైద్యసేవలు అమెరికా నమూనా.! అమెరికా వైద్యవిధానం లోపభూయిష్టమైనా, ఆ దేశం సంపన్నమైనది కాబట్టి జీడీపీలో 18 శాతం దాకా ఖర్చు పెట్టి ఎలాగోలా అక్కడి ప్రజలు వైద్యసేవల్ని పొందగలుగుతున్నారు. కానీ జీడీపీలో 2 శాతాన్ని కూడా వైద్యానికి ఖర్చు చేయలేని మనదేశంలో అదే రకంగా బీమా ఆధారిత వైద్య సేవల్ని అందిస్తే, మున్ముందు ఆర్థికరంగం ఒత్తిడికి గురయ్యే అవకాశముంది. ఇది అంతిమంగా ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించే ప్రయత్నాన్నే దెబ్బతీయవచ్చు. అందుకే బీమా ఆధారిత సేవల్ని పరిమితంగానే ఉపయోగించుకుంటూ బ్రిటన్ నమూనాలో ఫ్యామిలీ డాక్టర్ ఆధారిత ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను నిర్మించుకోవటం, ప్రైవేటు భాగస్వామ్యాన్ని తీసుకుంటేనే ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను క్రమంగా పటిష్టం చేసుకోవటం మన దేశానికి సరైన ఆరోగ్య విధానమవుతుంది.

మనదేశానికి పెద్దసంఖ్యలో వైద్యనిపుణులు అందుబాటులో ఉన్నారు. మందుల తయారీలో మనం ప్రపంచంలోనే

**బ్రిటన్ జనాభా ఎంతో.. అన్ని ఉద్యోగాలను ఈ రంగంలో అందించవచ్చు**

మనదేశానికి పెద్దసంఖ్యలో వైద్యనిపుణులు అందుబాటులో ఉన్నారు. మందుల తయారీలో మనం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్నాం. విధానపరమైన లోపాల్ని సరిచేస్తే, జీడీపీలో 2-3 శాతంతోనే అద్భుతమనదగ్గ ఆరోగ్య పథకాన్ని అందివచ్చు. దీనివల్ల దేశంలో మూడు కోట్ల దాకా ప్రత్యక్షంగా, పరోక్షంగా యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. బ్రిటన్, అమెరికా వంటి దేశాలతో పోలిస్తే, మన ఆరోగ్య రంగంలో పనిచేస్తున్నవారి సంఖ్య చాలా తక్కువ. లోక్‌సత్తా రూపొందించిన విధానం ద్వారా కొత్తగా వచ్చే ఉద్యోగాలను కూడా కలుపుకుంటే మనం దాదాపు బ్రిటన్ జనాభాతో సమానంగా వైద్య ఆరోగ్య రంగంలో ప్రజలకు ఉపాధిని అందించవచ్చు.

అగ్రగామిగా ఉన్నాం. విధానపరమైన లోపాల్ని సరిచేస్తే, జీడీపీలో 2-3 శాతంతోనే అద్భుతమనదగ్గ ఆరోగ్య పథకాన్ని అందివచ్చు. దీనివల్ల దేశంలో మూడు కోట్ల దాకా ప్రత్యక్షంగా, పరోక్షంగా యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. బ్రిటన్, అమెరికా వంటి దేశాలతో పోలిస్తే, మన ఆరోగ్య రంగంలో పనిచేస్తున్నవారి సంఖ్య చాలా తక్కువ. లోక్‌సత్తా రూపొందించిన విధానం ద్వారా కొత్తగా వచ్చే ఉద్యోగాలను కూడా కలుపుకుంటే మనం దాదాపు బ్రిటన్ జనాభాతో సమానంగా వైద్య ఆరోగ్య రంగంలో ప్రజలకు ఉపాధిని అందించవచ్చు.

ఓట్ల కోసమైనా, మరో రీత్యా అయినా ఆయుష్మాన్ భారత్ ఓ పెద్ద ముందడుగు అనటంలో సందేహం లేదు. పౌష్టికాహారాన్ని అందించటం, విద్యావ్యవస్థలో ఆరోగ్య బోధనను చేర్చటం వంటివి ఇందులో భాగం చేయటం ఆహ్వానించదగ్గదే. కానీ పునాది స్థాయి నుంచి రూపకల్పన సరిగా లేకుండా, నిధుల కేటాయింపుపై అంచనా లేకుండా, ఇచ్చిన నిధుల్ని కూడా అసంబద్ధంగా ఖర్చు చేస్తుంటే మాత్రం ఆ పథకం భారీ వైఫల్యాల జాబితాలోనే చేరుతుంది. ఈ స్కీమ్‌కి కనీసం రూ.1 లక్ష కోట్లు అవసరమైతే.. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానో, అవగాహనలేకో రూ.10వేల కోట్లు మాత్రమే కేటాయించింది. ప్రజలు యోగా, ధ్యానం చేసుకుంటూంటే ప్రశాంతంగా ఉంటారని, అప్పుడసలు అనారోగ్యంతో ఆస్పత్రుల పాలవ్వాల్సిన పరిస్థితి కూడా ఉండదని, దీంతో వైద్య బిల్లులు భారీగా తగ్గుతాయని పాలకులు లెక్కలేస్తున్నట్టుంది (చట్టబద్ధపాలన లేకుండా, సరైన విద్య, ఉపాధి లేకుండా, పాలనా వికేంద్రీకరణ లేకుండా, అవినీతిని ఆపకుండా ప్రజలు బీపీ బారిన పడకుండా ఎలా ప్రశాంతంగా ఉండగలరన్న ఇంగితజ్ఞానమన్నా ఉండాలిగా!). దేశ ప్రజలకు ఎంతో కీలకమైన ఆరోగ్య పథకాన్ని అసంబద్ధంగా రూపొందించి, దానికి కూడా తగినన్ని నిధుల్ని కేటాయించకుండా ప్రచారాన్ని మాత్రం పాలకులు డాబుసరిగా చేసుకుంటున్నారు. ఇది పూర్తిగా జనాన్ని బ్లఫ్ చేసే రాజకీయమే అవుతుంది.

విరాట్ కోహ్లీలాంటివారితో కలిసి ప్రధానమంత్రి మోదీ, కేంద్రమంత్రులు ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లు చేసుకుంటూ ఆరోగ్యంపై ఉపన్యాసాలు ఇస్తూ ఎల్లకాలం జనం దృష్టి మళ్లించలేరు. ఆరోగ్యం ప్రతి ఇంటికీ ఎలా అందుతుందో స్పష్టమైన ఆలోచనతో విధానాన్ని రూపొందించి అందించాలి. ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లు విసురుకుంటున్నా, తమకేదైనా ఆరోగ్యపరమైన తేడా చేస్తే 'ఎయిమ్స్' వంటి అత్యున్నత వైద్యసంస్థల్లోనే సేవల్ని పొందుతున్నా.. మన నాయకులు ఫిట్‌నెస్‌లో ప్రపంచ స్థాయిలో దిగువనే ఉన్నారు. మేక్రాన్, పుతిన్, చివరికి వయసుడిగిన ట్రంప్ కూడా మన నాయకుల కంటే ఫిట్‌గా ఉంటారు. నానాగడ్డీ కరిచి నల్లడబ్బు పోగేయటం, ఎన్నికల్లో ఆ డబ్బుతో ఓట్లు కొనడం, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టకుండా బ్రోకర్లలా వ్యవహరిస్తూ నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల్ని చేసి పెట్టి ఓటు అడగటం వంటివి మానేసి, పౌర సేవల చట్టం, దామాషా పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి సంస్కరణలతో అధికారాన్ని ఓ మార్గంగా మాత్రమే గుర్తించి తమ బాధ్యతలకు పరిమితమైతే.. మన నాయకులు కూడా ఫిట్‌నెస్‌ని పెంచుకోగలుగుతారు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి చట్టబద్ధపాలన, స్థానిక స్వయంపాలన వంటి మౌలిక మార్పుల్ని కూడా ఏ పార్టీ అధికారంలో ఉన్నా పాలనలో భాగం చేయగలిగితే.. అప్పుడు నాయకులు, ప్రజలు కూడా పూర్తి ఫిట్‌గా ఉండే దేశంగా భారత్ రూపుదిద్దుకుంటుంది.

ఆయుష్మాన్ భారత్‌లోని లోపాల్ని సరిదిద్దేలా చేయటానికి లోక్‌సత్తా తన వంతు ప్రయత్నం చేస్తోంది. 2005లో జాతీయ ఆరోగ్య మిషన్‌ను (ఈ బిల్లునే అప్పటి యూపీయే ప్రభుత్వం పలు కత్తెరలతో అరకొరగా అమలు చేసింది) రూపొందించిన అనుభవం, వివిధ దేశాల ఆరోగ్య విధానాల తాజా అధ్యయనం నుంచి లోక్‌సత్తా రూపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 2016లో అందించిన సమగ్ర ఆరోగ్య విధానం నమూనా (ప్రజలు తమ జేబుల్లో నుంచి రూపాయి ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా 'అందరికీ ఆరోగ్యం' అందించే విధానం)ను www.fdrindia.org లో చదవొచ్చు.

❖

# బ్రిటన్‌లో ఫ్యామిలీ డాక్టరే కీలకం

> నేరుగా స్పెషలిస్టు సేవలు నిషేధం

> ఇష్టానుసారంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయకూడదు

> ప్రతి చికిత్సకూ వైద్యుడే జవాబుదారీ

> ఎప్పటికప్పుడు ప్రతిభను మెరుగుపర్చుకోవాల్సిందే

> నైపుణ్య సమీక్షలో విఫలమైతే వైద్యసేవలకు అనర్హుడే

> 'ప్రతిష్ఠాత్మక 'బ్రిటిష్ ఎంపయిర్ మెడల్' గ్రహీత డాక్టర్ ప్రసాదరావు

**త**లనొప్పి వస్తే నేరుగా న్యూరాలజిస్టును కలవడం.. కడుపునొప్పి వస్తే హుటాహుటిన గ్యాస్ట్రోఎంటరాలజిస్టును సంప్రదించడం వంటివి మన దగ్గర సాధారణం. కానీ, బ్రిటన్‌లో అలా చెల్లుబాటు కాదు. అక్కడ నేరుగా స్పెషలిస్టు వైద్యసేవలనేవి నిషేధం. కుటుంబ వైద్యునిదే (జనరల్ ప్రాక్టిషనర్) ఇంగ్లండ్‌లో కీలకపాత్ర. ముందుగా కుటుంబ వైద్యుని సంప్రదించాక, ఆయన సూచనల మేరకే స్పెషలిస్టు వైద్యసేవలు లభిస్తాయి. పైగా, రోగికి అందించే ప్రతి చికిత్సకూ వైద్యుడే జవాబుదారీ! ఏటేటా తన వృత్తికి సంబంధించిన ప్రతిభా నైపుణ్యాలను మెరుగుపర్చుకోకపోతే.. వైద్యసేవలకు అనర్హుడిగా పరిగణిస్తారు. ఇలా వైద్యుల నైపుణ్యాలను సమీక్షించే కొలమానం మన దగ్గర లేదు. వైద్యుడు ఇష్టానుసారంగా నిర్ధారణ పరీక్షలు రాసినా, అసలా వైద్యుని చికిత్స తీరు సరైన విధానంలోనే వెళ్తోందా? అని పరీక్షించే విధానమే మనకు లేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో అగ్రగామిగా నిలిచే బ్రిటిష్ వైద్యంలోంచి మనం అనుసరించాల్సిన విధానాలెన్నో ఉన్నాయి ('జేబుల్లో నుంచి రూపాయి ఖర్చు లేకుండా ప్రజలందరికీ ఆరోగ్యం' అందించేందుకు లోక్‌సత్తా ప్రతిపాదించిన ఆరోగ్య నమూనా కూడా బ్రిటన్ నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్ఎస్) ఆధారంగానే రూపొందించినది. అయితే భారతదేశం, తెలుగు రాష్ట్రాల పరిస్థితులు, బడ్జెట్‌లకనుగుణంగా!). బ్రిటన్‌లో 35 ఏళ్లుగా నిరంతరాయంగా వైద్యసేవలు అందించి, ఇటీవల వృత్తి విరమణ పొందిన తెలుగు వైద్యుడు సూర్యదేవర యదుపూర్ణచంద్ర ప్రసాదరావు.. ఇంగ్లండ్‌లోని వైద్య విధానాలపై పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. డాక్టర్ ప్రసాదరావు అందించిన విశేష సేవలను గుర్తించిన యూకే ప్రభుత్వం.. 2018లో (దాదాపు మనకు స్వతంత్రం వచ్చినప్పుడు మొదలైన ఎన్‌హెచ్ఎస్ ఈ ఏడాదే 70 ఏళ్లు పూర్తి చేసుకుంది) ఆయన్ను 'బ్రిటిష్ ఎంపయిర్ మెడల్' పురస్కారంతో సత్కరించింది. బ్రిటన్ మహారాణి చేతుల మీదుగా అందుకునే గౌరవమిది. హైదరాబాద్‌కు వచ్చిన డాక్టర్ ప్రసాదరావుతో 'ఈనాడు' పత్రిక ఇంటర్వ్యూ..



**ప్రశ్న: ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం పొందినందుకు శుభాకాంక్షలు. బ్రిటన్ వైద్యంతో మీ అనుబంధం?**

**డాక్టర్ ప్రసాదరావు:** మా స్వస్థలం గుంటూరు జిల్లా చేబ్రోలు. విశాఖపట్నంలోని ఆంధ్రా వైద్య కళాశాలలో 1973లో ఎంబీబీఎస్ పట్టా పొందాను. తర్వాత ఇంగ్లండ్ వెళ్లాను. అప్పట్నుంచి జాతీయ ఆరోగ్య సేవ (ఎన్‌హెచ్ఎస్)లోనే. భార్య, ఇద్దరబ్బాయిలూ వైద్యులే. 1984 నుంచి జనరల్ ప్రాక్టిషనర్‌గా ఇంగ్లండ్ సమీపంలోని 'స్టోక్ ఆన్ ట్రెంట్‌సిటీ'లోని 'బెల్‌గ్రేవ్ మెడికల్ సెంటర్'లో సేవలందిస్తూ వచ్చాను. ఇటీవలే వృత్తి విరమణ పొందాను. ఒక తెలుగు వైద్యునికి ప్రతిష్ఠాత్మక పురస్కారం దక్కడం గౌరవంగా భావిస్తున్నా. గతంలో 22 ఏళ్ల కిందట మరో తెలుగు వైద్యుడిని ఈ పురస్కారం వరించింది.

**అక్కడ వైద్య విధానం ఎలా ఉంటుంది?**

మనకు మాదిరిగానే అక్కడ కూడా ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నతస్థాయి.. ఇలా మూడంచెల వైద్యవిధానమే ఉంది. అన్ని స్థాయిల వైద్యం పూర్తిగా ఉచితం. అయితే, ప్రాథమిక వైద్యం ఇంగ్లండ్‌లో కీలకపాత్ర పోషిస్తుంది. జలుబు, దగ్గు, తలనొప్పి

వస్తే నేరుగా స్పెషలిస్టు వైద్యుని వద్దకు వెళ్లరు. ముందుగా కుటుంబ వైద్యుని వద్దకే వెళ్తారు. ఒక్కో రోగిని పరీక్షించడానికి కనీసం 15-20 నిమిషాల సమయం తీసుకుంటారు. పూర్వచరిత్ర తెలుసుకుని, వ్యాధి లక్షణాల ఆధారంగా జనరల్ ప్రాక్టిషనరే ప్రాథమిక చికిత్స చేస్తారు. స్పెషలిస్టు సేవలు అవసరమని కుటుంబ వైద్యుడు గుర్తిస్తేనే.. ఉన్నత వైద్యం కోసం సిఫారసు చేస్తారు. సిఫారసు లేకుండా సాధారణ వైద్యసేవల కోసం స్పెషలిస్టుల వద్దకు వెళ్లడానికి వీల్లేదు. ఇంటి పక్కనే పెద్ద స్పెషాలిటీ ఆసుపత్రి ఉన్నా.. నేరుగా అక్కడికి వెళ్లి చికిత్స పొందడం కుదరదు.

**ఎప్పుడవసరమైనా ప్రాథమిక వైద్యులు అందుబాటులో ఉంటారా?**

ఉంటారు. ఉండాలి కూడా. ఇంగ్లండ్‌లో పౌరులంతా తప్పనిసరిగా వారు నివసించే ప్రాంతంలోని కుటుంబ వైద్యుని వద్ద తమ ప్రాథమిక సమాచారాన్ని నమోదు చేసుకోవాలి. అలా ప్రతి కుటుంబ వైద్యుని వద్ద సుమారు 1,600-2,000 మంది పౌరులు నమోదై ఉంటారు. వారి ఆరోగ్య బాధ్యత సంబంధిత వైద్యునిదే. చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా, ఆయననే సంప్రదించాల్సి ఉంటుంది. ముందస్తు అనుమతి పొందిన తర్వాత నిర్దేశించిన తేదీ, సమయంలో సంప్రదించాలి. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు ఓపీ సేవలు లభిస్తాయి.

**రోగితో అనుబంధం ఎలా ఉంటుంది?**

ఒక్కో రోగికి కనీసం పది నిమిషాలైనా కేటాయిస్తారు. ఇప్పుడా సమయాన్ని 15 నిమిషాలకు పెంచమంటున్నారు. రోగి పూర్వచరిత్ర తెలుసుకుని చికిత్స చేస్తారు. ప్రతి సమాచారం ఆన్‌లైన్‌లో లభ్యమవుతుంది. రోగికి ఎలాగైతే నిబంధనలున్నాయో.. వైద్యునికి అలాంటి నిబంధనలే పెట్టారు. అధిక రక్తపోటు ఉంటే ఎలాంటి పరీక్షలు చేయాలి? గుండెజబ్బు ఉంటే ఏ పరీక్షలు చేయించాలి? ఇలా ఏ జబ్బుకు.. ఎలాంటి లక్షణాలకు.. ఏ విధమైన చికిత్స చేయాలనే నిర్దిష్ట, స్పష్టమైన మార్గదర్శకాలు జాతీయ ఆరోగ్య సేవల్లో పొందుపరిచారు. వాటిని వైద్యులందరూ పాటించాల్సిందే. ఒకేవిధమైన మార్గదర్శకాలను పాటిస్తారు కాబట్టి.. ఆ దేశంలో ఎక్కడున్నా, ఒకే విధమైన చికిత్స లభిస్తుంది.

**మార్గదర్శకాలను పాటిస్తున్నారో, లేదో ఎలా తెలుస్తుంది?**

ప్రతి వైద్యునికి వార్షిక పనితీరు అంచనా ప్రక్రియ తప్పనిసరి. అదే విభాగానికి ఇతర వైద్యుల బృందం ప్రతిభానైపుణ్యాలను సమీక్షిస్తుంది. ఎప్పటికప్పుడు ఎలాంటి అధునాతన వైద్య పరిజ్ఞానాన్ని అలవర్చుకున్నారు? గతేడాది ఈ వైద్యునిపై ఎన్ని ఫిర్యాదులున్నాయి? ఎందుకున్నాయి? ఏమేం ప్రత్యేక నైపుణ్యాలు సాధించారు? తదితర అంశాలను సమీక్షించి వైద్యసేవలకు అనుమతిస్తారు. ఉదాహరణకు ఒక వైద్యుడు తన వద్దకు తలనొప్పితో వచ్చిన రోగుల్లో ఎంతమందికి సీటీస్కాన్ చేయించాడు? అందులో ఆ వైద్యుని అంచనాలో విజయం శాతమెంత? అనేది చూస్తారు. వ్యాధిని అంచనా వేయడంలో విఫలమైతే.. ఆ వైద్యుని పనితీరుని సందేహించాల్సి వస్తుంది. రోగ నిర్ధారణలో కచ్చితత్వం లోపిస్తుందని భావించాల్సి ఉంటుంది. ఈ సమీక్షలో విఫలమైతే వైద్యసేవలు చేయడానికి వీల్లేదు. అలా ఐదేళ్లపాటు ఏటేటా ఉత్తీర్ణులైతేనే ఐదో ఏట అర్హత నమోదు పత్రాన్ని పునరుద్ధరిస్తారు. ఇది చాలా ముఖ్యమైన ప్రక్రియ. అందుకే వయసుతో సంబంధం లేకుండా వైద్యులందరూ తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరచుకుంటారు. అందుకు అవసరమైన సాక్ష్యాలను, అధ్యయనాలను ప్రదర్శిస్తారు.

**బ్రిటన్ వైద్యంలో మీరు గమనించిన లోటుపాట్లు?**

ఇంగ్లండ్‌లోనూ వైద్యుల కొరత ఉంది. ముఖ్యంగా జనరల్ ప్రాక్టిషనర్ల కొరత ఎక్కువ. వైద్యుని సంప్రదింపుల కోసం రోగులు ఎక్కువకాలం వేచిచూడాల్సి రావడం మరోటి. అందుకే నర్సులకూ ఇటీవల 'అడ్వాన్స్‌డ్ నర్సు ప్రాక్టిషనర్' (ఏఎన్‌పీ) కోర్సుపై శిక్షణ ఇస్తున్నారు. వైద్యుడు వ్యాధిని నిర్ధారిస్తాడు. సూచించిన చికిత్సను శిక్షణ పొందిన నర్సు అమలు చేస్తుంది. ఇటీవల హెర్నియా, వెరికోస్ వీన్స్, వెసెక్టమీ, వినికిడి పరికరాలు తదితర కొన్నిరకాల చికిత్సలను ఉచిత వైద్యం నుంచి తొలగించారు.

**అక్కడ ప్రైవేటు వైద్యం?**

బ్రిటన్‌లో ప్రైవేటు వైద్యులున్నా.. వారి వద్దకు వెళ్లేవారు ఒక్క శాతం మంది కూడా ఉండరు. సినిమా తారలు, పారిశ్రామికవేత్తలు అలాంటి కొద్దిమంది.. అందునా కాస్మొటిక్ వైద్యం కోసమే ఎక్కువగా వెళ్తారు.

❖

**అత్యవసరమైతే..?**

ఓపీ సమయంలో అత్యవసరమైతే.. ఎలాంటి ముందస్తు అనుమతి లేకపోయినా వైద్యుడిని సంప్రదించొచ్చు. అవసరమనుకుంటే ఆయన వెంటనే స్పెషలిస్టు వైద్యసేవలకు సిఫారసు చేస్తాడు. ఓపీ సేవల అనంతరం కూడా వైద్యుని సేవలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయి. అత్యవసరంలో ఏ సమయంలోనైనా కుటుంబ వైద్యుడిని సంప్రదించొచ్చు. రోగి వైద్యుని వద్దకు రాలేని పరిస్థితి ఉంటే, వైద్యుడే రోగి ఇంటికెళ్తాడు.

# పేదరికాన్ని కొనసాగించటానికి సింపుల్ మార్గం.. ప్రజారోగ్య రంగాన్ని నాశనం చేయడమే!




రాష్ట్రంలో, దేశంలో పేదరికాన్ని కొనసాగించటానికి సింపుల్ మార్గం వైద్య ఆరోగ్య రంగాన్ని నాశనం చేయటమేనని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ అన్నారు. ఏపీలో ఏడాదికి కనీసం రెండు లక్షలమంది, దేశంలో దాదాపు ఆరు కోట్ల మంది వైద్యం కోసం చేసిన అప్పుల వల్ల పేదలుగా మారిపోతున్నా పాలకులు మాత్రం ఇంకా ప్రజారోగ్యాన్ని పట్టించుకోకుండా గరీబీ హటావో నినాదాలు, స్కీములతో నాటకాలాడుతున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వైద్య స్కీంలు పేదలకు ఉచితంగా సేవలందిస్తున్నట్టు కనిపిస్తున్నాయిగానీ.. అవి వాస్తవానికి ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులకే ఆదాయాన్నందించే చిట్కాలుగా మారాయన్నారు. అందుబాటులో చికిత్సనందించే ఆరోగ్య విధానాన్ని ప్రాథమిక స్థాయి నుంచి అమలుచేయకుండా ప్రతి దానికీ పెద్దాస్పత్రిలో వైద్యం, జబ్బు ముదిరాక ప్రైవేటులో ఆపరేషన్లు అనే విధానాన్ని అమలుచేస్తుండటం వల్ల పేదలకు, మధ్యతరగతికి కూడా ఆరోగ్యం పెనుభారంగా మారిందన్నారు. వైద్యం కోసం వెళ్తే ఎన్ని అవస్థలు పడాలో, ఎంత ఖర్చవుతుందోనని రోగాలతోనే బతుకులు నెట్టుకొస్తున్నవారు అసంఖ్యాకంగా ఉన్నారన్నారు. ఇంత కీలకమైన సంక్షోభాన్ని చర్చించకుండా, పరిష్కారాలు సాధించకుండా రాజధాని భవనాల గురించి చర్చోపచర్చలు చేయటం ఏరకమైన పాలనని ప్రశ్నించారు.

ఒంగోలు నగరంలోని రిమ్స్‌ను సురాజ్య యాత్రలో భాగంగా జేపీ సందర్శించారు. డైరెక్టర్ డాక్టర్ వల్లీశ్వరినడిగి ఆస్పత్రిలోని వసతులు, ఓపీ, ఐపీ, సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. నవజాత శిశుసంరక్షణ కేంద్రం, అత్యవసర విభాగం, గైనిక్, డయాలసిస్ విభాగాలను పరిశీలించి రోగులు, వైద్యసిబ్బందితో మాట్లాడారు.

500 పడకలు గల రిమ్స్‌లో 700 మంది ఇన్‌పేషెంట్లుగా ఉన్నారని, పడకలు సరిపోక ఒకే మంచాన్ని ఇద్దరికి కేటాయిస్తున్నారని జేపీ అన్నారు. రోజుకు 1800మంది రోగులు వస్తున్నారన్నారు. కానీ ఇక్కడ అధునాతన సౌకర్యాలు, తగినంత సిబ్బంది లేకపోవడం వల్ల ఉన్న వైద్యుల మీద భారం పెరుగుతోందన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.150కోట్ల విలువైన వైద్యసేవల్ని రిమ్స్‌లో కేవలం రూ.30కోట్లతోనే అందిస్తున్నా, ఇక్కడి వైద్యులకు జీతభత్యాలు అవమానకరమైనరీతిలో ఉన్నాయన్నారు. ఒక్కో పడకకూ అన్ని ఖర్చులూ కలుపుకుని ఏడాదికి రూ.5లక్షలు మాత్రమే కేటాయిస్తున్నారని, ఈ ఖర్చును ప్రపంచంలో ఏ సాధారణ ప్రైవేటు ఆస్పత్రిలో ఊహించను కూడా లేమని అన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన చికిత్సల్ని అందించకపోతే ప్రధానంగా నష్టపోయేది పేదలేనన్నారు. ఇక్కడ ఒక్కో నర్సుకు రూ.15వేల వేతనం ఇస్తున్నారని, మెటర్నిటీ సెలవలు కూడా లేవని, ఎన్టీఆర్ వైద్యసేవ,

## వైద్యులకు అధ్యయనం, సహనం, సేవాభావం ముఖ్యం



వైద్యరంగంలో విద్యార్థుల సామర్థ్యానికి ఉత్తీర్ణత కొలమానం కాదని, ప్రయోగాత్మకంగా నేర్చుకుని నైపుణ్యాన్ని ప్రదర్శించటం ముఖ్యమని జేపీ అన్నారు. రిమ్స్ ఆస్పత్రిని సందర్శించిన అనంతరం వైద్య విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రిమ్స్‌లో అనేక కొరతలున్నా మెరుగైన సేవలందించేందుకు వైద్యసిబ్బంది కృషి చేస్తున్నారని, అధ్యయనం, సేవాభావం, సహనం వైద్యవృత్తిలో రాణించడానికి కీలకమని అన్నారు. వైద్యులు సామాజిక బాధ్యత గల పౌరులుగా వ్యవహరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వైద్యశాలలను బలోపేతం చేసి చిన్న ఆరోగ్య సమస్యలకు అక్కడే చికిత్స అందించే ఏర్పాటు చేస్తే, రిమ్స్ లాంటి ఆస్పత్రుల మీద భారం తగ్గుతుందని, ఇంకా మెరుగైన సేవల్ని అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రైవేటు వైద్యశాలలు అందించే ఖర్చులో కేవలం ఐదో వంతుతో రిమ్స్ వంటి వైద్యశాలల్ని, బోధనాస్పత్రుల్ని ఇంకా మెరుగు పరిచేందుకు చర్యలు అవసరమన్నారు. రిమ్స్‌లో ఒక్కో బెడ్‌కు రూ.5లక్షలు ఖర్చవుతుంటే, కార్పొరేట్ ఆస్పత్రిలో అదే వైద్యానికి రూ.60లక్షలు దాకా అవుతుందని అన్నారు. తగినన్ని బోధనాస్పత్రులు లేకపోవడం, వైద్య సీట్ల మంజూరు లేకపోవటం వల్ల తెలుగు రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ సీటుకు కోసం ఎక్కడాలేనంత పోటీ నెలకొందన్నారు. మనదేశంలో వైద్యం, విద్యను దశాబ్దాలుగా నిర్లక్ష్యం చేయటంతో నివారించదగ్గ బాధలతో, మరణాలతో కోట్లమంది ప్రజలు నలిగి పోతున్నారన్నారు. పౌష్టికాహారం, సరైన ప్రాథమిక వైద్యం అందక ఐదేళ్లలోపే అకాల మరణాలు సంభవిస్తున్నాయన్నారు. అన్ని వనరులు, అవకాశాలు ఉన్నా కేవలం పాలకుల విధానాలు సరిగా లేకపోవడం వల్లే రాష్ట్రంలో, దేశంలో మానవ వనరులు వృధా అవుతున్నాయన్నారు.

జాతీయ ఆరోగ్య మిషన్ రూపశిల్పిగా వైద్యరంగానికి సంబంధించిన అనేక అంశాలను జేపీ వైద్య విద్యార్థులకు తేలిగ్గా అర్థమయ్యేలా వివరించారు. దేశ భవిష్యత్తుకు కీలకమైన ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించే పనిలో ఉన్నామనే స్పృహను వైద్యరంగంలోనివారు నిరంతరం కలిగివుండాలని సూచించారు.

ఈ సందర్భంగా డాక్టర్ వెంకయ్య రిమ్స్‌లోని సమస్యలను జేపీ దృష్టికి తీసుకొచ్చారు.

రిమ్స్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, ఆర్ఎంవో సుబ్బారావు, గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ రాజమన్నార్, లోక్‌సత్తా నేతలు బండారు రామ్మోహనరావు, రాధాదేవి, సీఏ ప్రసాద్, డాక్టర్ కొర్రపాటి సుధాకర్, శివరమేష్ రెడ్డి, ఈదర భరత్, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రీ ఇంబర్స్‌మెంట్ వర్తించవని అన్నారు. వారికి అనారోగ్యం వచ్చినా అప్పులు చేయాల్సిందేనన్నారు. ఇలాంటి పరిస్థితినే కొనసాగించి ప్రభుత్వాస్పత్రుల్ని సమూలంగా దెబ్బతీయాలన్నట్టు పాలకులు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రపంచంలో ఎక్కడైనా వైద్యరంగానికి ఏడెనిమిది శాతం ఖర్చు చేస్తుంటే, మనదేశంలో మాత్రం ఒక్క శాతం మాత్రమే కేటాయిస్తున్నారన్నారు. 80శాతం వైద్యఖర్చుల్ని జనం జేబుల్లో నుంచే ఖర్చు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, ఇది పూర్తిగా ఆచరణ సాధ్యమని, ఇలాంటి నమూనా విధానాన్ని లోక్‌సత్తా ఇప్పటికే తయారుచేసి ప్రభుత్వాలకు అందించిందని వివరించారు. ❖

# తెలుగు రాష్ట్రాల్లో 30శాతం మంది చిన్నారుల్లో ఎదుగుదల సమస్య



లోక్‌సత్తా, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్), యూత్ ఫర్ బెటర్ ఇండియా విద్యావ్యవస్థపై నిర్వహించిన యూత్ పార్లమెంట్‌లలో.. వయసుకు తగ్గ ఎదుగుదల లేని విద్యార్థుల గురించిన ప్రస్తావన పలుమార్లు వచ్చింది. సమావేశాల్లో పాల్గన్న పిల్లల్లోనే పలువురు తగినంత బరువు, చలాకీతనం లేకుండా ఉండటం పట్ల ఆందోళన వ్యక్తమైంది.

పిండ దశలో, ఆ తర్వాత ఐదేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం సరిగా అందుకుంటే విద్యార్థి దశలో, ఆ తరువాత కూడా ఈసురోమంటూ ఉండాల్సిందే. దీనివల్ల అనారోగ్య సమస్య పెరగటంతోపాటు.. యువత సంఖ్య పుష్కలంగా ఉన్నా కూడా పోటీతత్వం, దేశ ఉత్పాదక శక్తి తగ్గుతుంది. గత రెండేళ్లలో యూనిసెఫ్ (ఐక్యరాజ్యసమితి బాలల నిధి) చేసిన అధ్యయనం ప్రకారం.. తెలుగు రాష్ట్రాలలో ఐదేళ్లలోపు పిల్లల్లో 30శాతానికిపైగా ఎత్తుకు తగ్గ బరువు లేరు. చిన్నారుల్లో ఎదుగుదల మందగిస్తోంది. కొన్ని జిల్లాల్లో ఇలాంటి చిన్నారుల సంఖ్య లక్షకుపైగానే ఉంది. మహిళల్లో రక్తహీనత, పౌష్టికాహారలేమి, బిడ్డ పుట్టాక పోషణ.. పిల్లల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి, చిన్నారికి ఐదేళ్లు వచ్చేవరకు.. పలుదశల్లో సామాజిక, మౌలిక, ఆరోగ్య అంశాల ప్రాతిపదికన యూనిసెఫ్ 2016–17లో ఈ సర్వే నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 11 లక్షలమంది, తెలంగాణలో 7 లక్షల మంది పిల్లల్ని పరిశీలించారు.

| ఆంధ్రప్రదేశ్‌లో.. | |
|---|---|
| జిల్లా | ఎదుగుదల క్షీణిస్తున్న చిన్నారుల శాతం |
| గుంటూరు | 22 |
| కృష్ణా | 23 |
| తూర్పు గోదావరి | 28 |
| శ్రీకాకుళం | 28 |
| ప్రకాశం | 28 |
| పశ్చిమ గోదావరి | 28 |
| నెల్లూరు | 29 |
| విశాఖపట్నం | 30 |
| చిత్తూరు | 31 |
| కడప | 36 |
| విజయనగరం | 37 |
| అనంతపురం | 40 |
| కర్నూలు | 44 |

| తెలంగాణలో (పాత పది జిల్లాల ప్రకారం).. | |
|---|---|
| జిల్లా | ఎదుగుదల క్షీణిస్తున్న చిన్నారుల శాతం |
| హైదరాబాద్ | 16 |
| కరీంనగర్ | 24 |
| రంగారెడ్డి | 26 |
| ఖమ్మం | 26 |
| వరంగల్ | 27 |
| నల్గొండ | 29 |
| మెదక్ | 33 |
| నిజామాబాద్ | 37 |
| మహబూబ్‌నగర్ | 37 |
| ఆదిలాబాద్ | 38 |

***తెలుగు రాష్ట్రాలలో ఐదేళ్లలోపు పిల్లల్లో 30శాతానికిపైగా ఎత్తుకు తగ్గ బరువు లేరు. చిన్నారుల్లో ఎదుగుదల మందగిస్తోంది. కొన్ని జిల్లాల్లో ఇలాంటి చిన్నారుల సంఖ్య లక్షకుపైగానే ఉంది. మహిళల్లో రక్తహీనత, పౌష్టికాహారలేమి, బిడ్డ పుట్టాక పోషణ.. పిల్లల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి, చిన్నారికి ఐదేళ్లు వచ్చేవరకు.. పలుదశల్లో సామాజిక, మౌలిక, ఆరోగ్య అంశాల ప్రాతిపదికన యూనిసెఫ్ 2016-17లో ఈ సర్వే నిర్వహించింది.***

### 50శాతానికి పైగా మహిళల్లో రక్తహీనత

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మహిళల్లో సగంమందికిపైగా తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్నారు. 15-49 ఏళ్ల వయసున్నవారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపించింది. దీంతో వీరి బిడ్డలు పుట్టుక నుంచి బలహీనంగా ఉంటున్నారు. పెళ్లీడు రాకముందే వివాహమైన యువతులకు జన్మించిన తొలి సంతానంలో ఎదుగుదల తక్కువగా ఉంటోంది. 25శాతానికిపైగా మహిళలు పౌష్టికాహారలోపంతో బాధపడుతున్నారు.

### 39శాతం మందికే తల్లిపాలు

మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలుగు రాష్ట్రాల్లో ప్రసవాలు ఎక్కువగా ఆసుపత్రుల్లో జరుగుతున్నాయి. సిజేరియన్లూ ఎక్కువే. వైద్య, ఆరోగ్య కార్యకర్తల సేవలు అందుబాటులో ఉన్నా, ఆరోగ్య పరీక్షల విషయంలో అంతంత మాత్రంగానే సేవలందిస్తున్నారు. 39శాతం మంది తల్లులు మాత్రమే ప్రసవించిన వెంటనే పిల్లలకు పాలు పడుతున్నారు. 6-23 నెలల చిన్నారుల్లో 7శాతం మందే అదనపు ఆహారం తీసుకుంటున్నారు.

### రక్షిత మంచినీరు, పారిశుద్ధ్యం కొరవడటం

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రక్షిత మంచినీరు, మరుగుదొడ్డి వసతులున్న ఇళ్లు తక్కువగా ఉన్నాయి. కలుషిత నీరు, అపరిశుభ్రత మహిళల ఆరోగ్యం, చిన్నారుల ఎదుగుదల మీద ప్రభావం చూపుతున్నాయి. లక్షలాదిమంది చిన్నారులు ఉండాల్సిన బరువు కంటే 60శాతానికిపైగా తక్కువ బరువుతో ఉన్నారు.

### పేదరికం, ఆర్థిక పరిస్థితులు

పేదరికం, సామాజిక-ఆర్థిక పరిస్థితులు, సరైన చదువు లేకపోవటం, అవగాహనాలేమి పిల్లల శారీరక వికాసంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కుటుంబ ఆదాయం, ఖర్చులను పరిశీలిస్తే.. పేదల ఆదాయంలో సగానికిపైగా తిండికే ఖర్చవుతోంది.

❖

# ఆదర్శ పౌరుడికి హిందూ, ముస్లిం పేరుతో వేధింపులా? పాపాలాల్‌కు ప్రభుత్వం, సమాజం న్యాయం జరిపించాలి: జేపీ



హైదరాబాద్ గోకుల్ చాట్‌లో 2007లో జరిగిన బాంబు పేలుడు ఘటనలో ఆదర్శ పౌరుడిగా స్పందించిన పాపాలాల్ రవికాంత్‌ను వేధింపులకు గురిచేయటాన్ని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తీవ్రంగా ఖండించారు. బాంబు పేలుడు ఘటనాస్థలంలో అనాథగా ఉన్న మూడేళ్ల బాలికను పెంచుకుని చదివించటాన్ని, ఆ బాలిక పుట్టిన మత సాంప్రదాయంలోనే పెంచటాన్ని హిందూ, ముస్లిం ఘర్షణగా చిత్రీకరించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నించటం పట్ల సమాజమంతా సిగ్గుపడాలన్నారు. దాదాపు దశాబ్దకాలంగా ఈ వేధింపులు జరుగుతున్నా ఇప్పటివరకూ చట్టం పరిష్కరించలేకపోవటం ప్రభుత్వాల దివాళాకోరు పాలనకు నిదర్శనమన్నారు.

పెయింటర్‌గా ఉన్న పాపాలాల్ 2007 ఆగస్టు 25న కోఠి వద్ద గోకుల్ చాట్ బాంబు పేలుడు ఘటన జరిగినప్పుడు అదే ప్రాంతంలోని నరసింహస్వామి ఆలయానికి రంగులు వేస్తున్నారు. బాంబు పేలుడు శబ్దం విని అటు పరుగెత్తారు. జనం మధ్య ఏడుస్తున్న మూడేళ్ల పాపను చూసి తల్లిదండ్రుల కోసం వెతికినా కనిపించకపోవటంతో బేగంబజార్‌లోని తన ఇంటికి తీసుకెళ్లారు. ఆ పాప చెప్పిన తల్లిదండ్రుల పేర్లను బట్టి ముస్లిం కుటుంబానికి చెందినదని భావించారు. పాపను అనాథాశ్రమానికి పంపించకుండా తామే పెంచుకుంటున్న పాపాలాల్, జయశ్రీ దంపతుల ఆదర్శాన్ని అప్పట్లో అందరూ ప్రశంసించారు. అయితే హిందువై ఉండి ముస్లిం బాలికను పెంచుకుంటావా అని కొందరు హిందువులు అభ్యంతర పెట్టటంతోపాటు మతమార్పిడికి ఒత్తిడి చేశారు. పాపాలాల్ అంగీకరించకపోవడంతో ముస్లింలను కూడా రెచ్చగొట్టి గొడవ ప్రారంభించారు. దీంతో ముస్లిం సంప్రదాయం ప్రకారమే పాపను పెంచుతున్నా కూడా.. ఆమెకు రెండు మతాలకు సంబంధించినది కాకుండా సోనియా అని పేరు మార్చారు. ముస్లింలు సానియా ఫాతిమా అని పిలుస్తుంటే, హిందువులు పాప పెంపకాన్నే వ్యతిరేకిస్తున్నారు. మానవ హక్కుల సంఘం జోక్యంతో కొంతకాలం సద్దుమణిగినా, గత కొంతకాలంగా మళ్లీ మొదలైంది. 9వ తరగతి చదువుతున్న ఆ బాలికను ప్రేమ పేరుతో వేధించటం మొదలుపెట్టారు. ఇదేంటని ప్రశ్నించిన పాపాలాల్‌పై కత్తులతో దాడి చేశారు.

మీడియాలో వెలువడిన ఈ సమాచారంపై జేపీ స్పందిస్తూ.. పోలీసు ఉన్నతాధికారులు, హోంశాఖ ఈ కేసుపై తక్షణం స్పందించి దర్యాప్తు చేపట్టాలన్నారు. ఓ హెచ్చరికలా ఉండేలా దోషులకు వేగంగా శిక్ష పడేలా చేయాలన్నారు. ఇందులో స్థానిక పోలీసులకు ప్రమేయమున్నా ఉపేక్షించకూడదన్నారు. సమాజహితాన్ని కోరేవారంతా ముందుకొచ్చి పాపాలాల్ ఆదర్శ కృషికి అండగా నిలవాలని.. మంచిని, మానవీయతను హిందూ-ముస్లిం విభేదాలు అణగదొక్కలేవనే బలమైన సంకేతాన్నివ్వాలని జయప్రకాష్ నారాయణ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

❖

# జులై 15 నుంచి జిల్లాలవారీగా సురాజ్య సదస్సులు, పార్లమెంటులో జేపీ, జేడీలాంటి వాళ్లు ఉండాలి: లోక్‌సత్తా




విభజన హామీలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కు అన్నీ ఇచ్చేశామని కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయటాన్ని తిరుపతిలో జరిగిన లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సమావేశం తీవ్రంగా తప్పుపట్టింది. ఏపీ అంటే చంద్రబాబు మాత్రమే కాదని, ఐదు కోట్ల మంది ప్రజల ప్రయోజనాలతో చెలగాటమాడుతున్నామని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గుర్తించాలని స్పష్టంచేసింది. సమావేశం వివరాలను లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో కలిసి అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు తెలియజేశారు. విభజన నేపథ్యంలో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఇంకా ఎన్ని ఉన్నాయో తెలుగేతర నిపుణులతో జేపీ మదింపు చేయిస్తున్నారని, త్వరలో నివేదికను వెల్లడిస్తామని తెలిపారు. చట్టం తయారీలో కేంద్ర ప్రభుత్వ తప్పిదం వల్ల ఏపీకి రావాల్సిన రూ.3,280 కోట్ల పన్నుల ఆదాయం తెలంగాణకు వెళ్లిపోతున్నా అడిగి తీసుకునే ధైర్యం చంద్రబాబుకు లేకుండా పోయిందన్నారు. రాజ్యాంగమార్గంలో సరైన ప్రశ్నలు లేవనెత్తి నిధుల్ని రాబట్టే ప్రయత్నం చేయకుండా.. మోదీపై విమర్శలతో రాజకీయ లబ్ధి పొందేందుకే ముఖ్యమంత్రి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇప్పుడో నూతన ప్రత్యామ్నాయం కావాల్సుందన్నారు. తెలుగు రాష్ట్రాల, దేశ విశాల ప్రయోజనాల దృష్ట్యా పార్లమెంటులో జేపీ, జేడీలాంటి నాయకులు ఉండాల్సిన అవసరముందని, పార్టీలకతీతంగా జనవాణిని వినిపించేందుకు వీరు పోటీచేయాల్సుందని పార్టీలకతీతంగా సమావేశం తీర్మానించిందన్నారు. ఎన్నికలు, వ్యాపారాలు, జెండాలు తప్ప ప్రజల కోసం విధానాలు లేని ఎంపీలు, పార్టీల వల్లే ఏపీకి తీరని నష్టం జరుగుతోందన్నారు. విద్య, ఆరోగ్యం వంటి ప్రధాన రంగాల్లో పాలకుల కీలక వైఫల్యాలను, పార్టీల దోపిడీ రాజకీయ విధానాలను ఎండగడుతూ, జనహితం కోసం కావాల్సిన విధానాలపై అన్ని వర్గాలనూ చైతన్యపరుస్తూ జులై 15 నుంచి ప్రతి జిల్లాలో 'సురాజ్య' సదస్సులు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. రాష్ట్ర కమిటీ కార్యవర్గ సమావేశంలో లోక్‌సత్తా నేతలు రాజ్‌వర్మ (తూర్పు గోదావరి), పంచాది రాంబాబు (శ్రీకాకుళం), రాజ్యలక్ష్మి (కర్నూలు), వెంకటరమణబాబు (అనంతపురం), రామారావు (నెల్లూరు), సురేష్ (చిత్తూరు), రవికుమార్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు. ❖

# భూముల్ని గిరిజన రైతులకు తిరిగిచ్చేయండి



జిందాల్ కంపెనీ స్థాపన పేరుతో స్థానిక గిరిజన రైతుల భూముల్ని తీసుకున్నారని, కర్మాగారం రాలేదు సరికదా ఉన్న భూమిని రైతులు కోల్పోయారని.. ఆ భూముల్ని తిరిగి రైతులకు అందజేయాలని బాబ్జీ డిమాండ్ చేశారు. జిందాల్ పేరుతో దగాను నిరసిస్తూ విజయనగరం జిల్లా ఎస్.కోట పట్టణంలోని దేవి జంక్షన్ వద్ద రైతులతో కలిసి ఆయన నిరసన దీక్ష చేపట్టారు. డా॥ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం బాబ్జీ మాట్లాడుతూ, 2008 జూన్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 1048 ఎకరాల 65 సెంట్ల భూమిని జిందాల్‌కు అల్యూమినియం కర్మాగారం కోసం ఇచ్చిందని, ఇందులో 866.47 ఎకరాల డి.పట్టా భూమి ఉందని వివరించారు. భూ సేకరణతో రైతులకు రావాల్సిన రూ.22.44 కోట్లలో ప్రజాప్రతినిధులు, అధికారులు సుమారు రూ.10 కోట్లను బినామీ పేర్లతో దోపిడీ చేశారన్నారు. దీన్ని లోక్‌సత్తా ఆధారాలతో సహా బైటపెట్టిందన్నారు. రాష్ట్రం విడిపోయాక కూడా 2015లో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరాలతో లేఖ రాశారన్నారు. సీపీఎం, సీపీఐ, తెలుగుదేశం తదితర పార్టీ నేతలు వచ్చి చూసి వెళ్లారు తప్ప న్యాయం కోసం ప్రయత్నించలేదన్నారు. కర్మాగారం నిర్మించకపోతే రైతులకు వెంటనే భూముల్ని తిరిగి ఇవ్వాలని, నేటి వరకు ఇవ్వాల్సిన షేర్ ధరను చెల్లించాలని అన్నారు. నిరసన దీక్షలో లోక్‌సత్తా పార్టీ నేతలు కాండ్రేగుల ఈశ్వరరావు, కర్రి నాగేశ్వరరావు, కాండ్రేగుల ప్రసాద్, పద్మాకర్, గిరిజన రైతులు లోజమ్మ, అయితంశెట్టి శ్రీను, మిడతాన అప్పారావు, జి.శ్రీనివాసరావు, బుచ్చిరాజు, సంగిరెడ్డి దేముడు, మల్లేష్, మక్కా రామారావు, దారపురెడ్డి అచ్చింనాయుడు, మత్తి పెంటయ్య, వీరభద్రుడు, వి.శ్రీను, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ❖

# పెద్ద నోట్ల రద్దు నాటి దృశ్యాలను గుర్తుకుతెస్తున్న విత్తనాల క్యూలు




విత్తనాల కోసం వ్యవసాయాధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేట్టు చేస్తూ రైతులను ప్రభుత్వం అవమానిస్తోందని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. పెద్ద నోట్ల రద్దు విషయంలో కేంద్ర ప్రభుత్వ అసమర్థ నిర్వాకం వల్ల బ్యాంకుల వద్ద నెలకొన్న పరిస్థితిని తలపించేలా.. విత్తనాల కోసం వృద్ధులు సైతం పడిగాపులు కాస్తున్నారన్నారు. విజయనగరం జిల్లా గరివిడి మండలం కాపుశంభాం పీఏసీఎస్ వద్ద పరిస్థితిని లోక్‌సత్తా నేతలు స్వయంగా పరిశీలించారన్నారు. అధికార పార్టీ వాళ్లకి, అనుచరులకు చాటుగా విత్తనాల్ని ఇస్తున్నారన్నారు. రైతులకు విత్తనాలు సరిగా సరఫరా చేయలేనప్పుడు, పంటలకు న్యాయమైన ధర ఇప్పించలేనప్పుడు ఇక వ్యవసాయం కోసం ప్రత్యేక బడ్జెట్‌ను పెట్టి ఉపయోగమేంటని ప్రశ్నించారు? సీజన్‌లో విత్తనాల కొరతపై బాబ్జీ విజయనగరంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సాగుభూమి ఏటేటా తగ్గిపోవటం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2015-16లో 27.43 లక్షల హెక్టార్లలో వ్యవసాయం జరిగితే, 2016-17లో 27.02 లక్షల హెక్టార్లకు పడిపోయిందని, 2017-18లో 26.82 లక్షల హెక్టార్లకు తగ్గిందని అన్నారు. రైతు సమస్యలపై అధికార యంత్రాంగంతోపాటు మంత్రి, ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

**నేతల తప్పుల్ని దాచేందుకే..**

విశాఖపట్నంలోని భూకుంభకోణాలపై 'సిట్' ఇచ్చిన నివేదికను ముఖ్యమంత్రి దాచిపెట్టడానికి కొందరు సొంత పార్టీ నేతల్ని కాపాడుకునే రాజకీయ ఎత్తుగడే కారణమని బాబ్జీ అన్నారు. అధికార పార్టీ వారు జిల్లాలో భారీ అవినీతికి పాల్పడుతున్నారని, తనకేమీ తెలియదన్నట్టు చంద్రబాబు నాయుడు అమాయకంగా మాట్లాడటం దారుణమని అన్నారు. సిట్ నివేదికను వెంటనే బయటపెట్టాలని పునరుద్ఘాటించారు. సమావేశంలో లోక్‌సత్తా నాయకులు నాగభూషణం, శిమ్మ శ్రీను, సత్తిబాబు, గురునాథం, రాయి పద్మావతి, ఎర్నిబాబు, అప్పారావు, చంద్రరావు, సన్యాశినాయుడు తదితరులు పాల్గొన్నారు. ❖

# రాజ్యాంగాన్ని గడగడ చెప్పేసిన లక్ష్మీశ్రీజ



లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ టేబుల్ మీద నిరంతరం ఉండే పుస్తకం భారత రాజ్యాంగం. మనం కోరుకుంటున్న జీవన ప్రమాణాలకు-ఇప్పుడున్న సమాజ పరిస్థితులకు మధ్య వారధి రాజ్యాంగమని, రాజ్యాంగ ప్రజాస్వామిక మార్పును తేవటమే మన ముందున్న లక్ష్యమని ఆయన చెబుతుంటారు. జేపీలా రాజ్యాంగాన్ని రిఫర్ చేస్తూ మాట్లాడటమంటే కష్టమేనని పలువురు గొణుక్కుంటూ ఉంటారు. కానీ ఈ పిల్లను చూస్తే అలాంటివారిలో కొంతైనా మార్పు వస్తుందేమో! తెలంగాణ ఖమ్మం జిల్లాకు చెందిన పదేళ్ల బాలిక వేల్పుల లక్ష్మీశ్రీజ మన రాజ్యాంగంలోని 395 అధికరణాలనూ ఒక గంట సమయంలోనే కంఠతా చెప్పేసింది. తెలంగాణ స్పీకర్ కార్యాలయానికి తన తల్లిదండ్రులు సుధారాణి, కిరణ్ కుమార్‌తో కలిసి వచ్చిందావె. రాజ్యాంగాన్ని ఏకబిగిన చెప్పేసింది. అక్కడున్న ప్రముఖులు ఏ అధికరణ గురించి అడిగినా గడగడా వివరించేసింది. తెలంగాణ ఖ్యాతిని ఇనుమడింపజేసేలా ఉన్న ఆమె ధారణ ప్రతిభను ప్రశంసిస్తూ అక్కడున్న పెద్దలంతా ఆశీర్వదించారు. ❖

# పంటల బీమాల్లాగా లేవు..

రైతులకు రక్షణగా ఉండాల్సిన పంటల బీమా పథకాలు మనదేశంలో ఎంత అధ్వాన్నంగా అమలవుతున్నాయో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక వెల్లడించింది. ఇంతవరకూ ప్రభావం చూపలేని ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కూడా గుర్తించాల్సిన పలు వైఫల్యాలు ఇందులో ఉన్నాయి.

2011-12 నుంచి 2015-16 వరకు అమలయిన పంటల బీమా పథకాలు.. పంటలకు కాకుండా బ్యాంకుల నుంచి తీసుకున్న పంటల రుణాలకు బీమాల్లా ఉన్నాయని కాగ్ విమర్శించింది. బీమా అమలుతో సంబంధమున్న ఏ సంస్థా సరైన డేటా నిర్వహించకపోవడంతో రైతులకు పరిహారం చెల్లింపులో జాప్యం చేయడమో, పూర్తిగా ఎగ్గొట్టడమో జరిగిందని తెలిపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అసోం, గుజరాత్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషా, రాజస్తాన్‌లోని 33 జిల్లాల్లో సర్వే నిర్వహించారు.

నివేదికలోని ముఖ్యాంశాలు:

- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటా ప్రీమియం చెల్లించడంలో జాప్యం చేయడంతో రైతులకు పరిహారం చెల్లింపులపై ప్రభావం పడింది.
- బ్యాంకులు, ఆర్థిక సంస్థలు 15రోజుల్లోపు పంటల బీమా సంస్థకు వినియోగ ధ్రువ పత్రాలు (యూసీలు) సమర్పించాలి. చాలా బ్యాంకులు విఫలమయ్యాయి.
- ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు విద్యుత్ సరఫరా లైన్లకు దూరంగా ఉండాలి. కడప జిల్లాలో 96 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లలో 72 విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలోనే ఉన్నాయి. తెలంగాణలోనూ నాలుగు కేంద్రాలు ఇలాగే ఉన్నాయి.
- బీమా పథకం అమలులో రైతుల ఫిర్యాదుల పరిష్కారానికి ఏపీ, తెలంగాణ సహా చాలా రాష్ట్రాల్లో యంత్రాంగం లేదు.
- 2011-12 నుంచి 2015-16 మధ్యకాలంలో ఏయే ప్రాంతాల్లో పంటల సాగు జరగలేదన్న సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు సేకరించలేదు.
- సాధ్యమైనంత తక్కువ ప్రాంతాన్ని యూనిట్‌గా పరిగణించాలన్న నిబంధనను ఒడిషా ఒక్కటే అనుసరించింది. అక్కడ వరికి గ్రామాన్ని యూనిట్‌గా పరిగణించారు.
- ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిషాలలో విస్తీర్ణం కంటే 17.33లక్షల హెక్టార్ల విస్తీర్ణానికి అధికంగా బీమా చేశారు.
- ఏపీలోని అనంతపురం, కడప జిల్లాల్లో 1286మంది రైతులను సర్వే చేయగా 58శాతం మంది పంటల బీమా పథకం గురించి తెలియదన్నారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో 1027 మందిని సర్వే చేస్తే 81శాతం మంది ఇదే సమాధానమిచ్చారు.

బీమా అమలు రైతుల సమస్యలకు కీలక పరిష్కారం కాకపోయినా, ఆ పరిధి లోపల ఉపయోగపడే కొన్ని విలువైన సూచనలను కాగ్ ఈ సందర్భంగా చేసింది..

- పంటల బీమా కిస్తీ వాటాను రాష్ట్రప్రభుత్వాలు సకాలంలో చెల్లించే యంత్రాంగం ఉండాలి.
- జాతీయ వ్యవసాయ పంటల బీమా పథకం స్థానంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రవేశపెట్టినందున ఇంతకుముందు ఆదా అయిన మొత్తాన్ని ఏం చేయాలో కేంద్ర వ్యవసాయశాఖ నిర్ణయం తీసుకోవాలి. తగిన తనిఖీల తర్వాతే బీమా కంపెనీలకు సొమ్ము విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలి.
- బ్యాంకులు, ఆర్థిక సంస్థలు నిర్దిష్ట సమయంలో యూసీలు సమర్పించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలి. లబ్ధిదారుల వివరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా నిర్వహించాలి.
- బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోనివారూ పంటల బీమా పథకంలో భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలి.
- పంటల బీమాకు గ్రామాన్ని యూనిట్‌గా పరిగణించేలా రాష్ట్ర ప్రభుత్వాలను ప్రోత్సహించాలి.
- దిగుబడులను కచ్చితంగా లెక్కించడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టాలి.

➤ సాగు విస్తీర్ణం, బీమా చేసిన ప్రాంతం రెండూ సమానంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వాలు జాగ్రత్తలు తీసుకోవాలి.

## ప్లాస్టిక్‌ను నిషేధించండి



'బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్' అన్న ఐక్యరాజ్యసమితి 2018 నినాదానికనుగుణంగా విజయనగరంలో ప్లాస్టిక్‌ను నిషేధించాలని, పర్యావరణహిత సంచులకు ప్రోత్సాహాన్నివ్వాలని లోక్‌సత్తా పార్టీ నేతలు అల్లంశెట్టి నాగభూషణం, మొల్లేటి చిన్నారావు నేతృత్వంలోని బృందం మునిసిపల్ కమిషనర్‌ని కలిసి విజ్ఞప్తి చేసింది.

## మీరు ఏ ఆహారాన్ని ఎంత తీసుకోవాలి..

జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) సంయుక్త ఆధ్వర్యంలో పోషకాహార విలువలపై 'న్యూట్రిఫై ఇండియా నౌ' పేరుతో మొబైల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఈ యాప్ ప్రతి ఒక్కరికీ ఒక న్యూట్రిషన్ గైడ్‌లా పనిచేస్తుంది. ఒక వ్యక్తి ఏ ఆహారాన్ని ఎంత తీసుకోవాలి, తీసుకున్న ఆహారంలో ఏయే మోతాదుల్లో పోషకాలు ఉంటాయనే విషయాలను దీని ద్వారా తెలుసుకుని, ఆయా పదార్థాలను తీసుకునే వీలుంటుంది. పోషకాహార పదార్థాల పూర్తి స్థాయి సమాచారాన్ని ఈ యాప్ అందిస్తుంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో నివసించే భారతీయులు సాధారణంగా తీసుకునే ఆహార పదార్థాలు, వాటిలో కేలరీల శక్తి, ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ ఏయే మోతాదులో ఉంటాయి, అవి మన శరీరానికి ఏయే మోతాదుల్లో అవసరమనే విషయాలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. తెలుగు, ఇంగ్లీషు, హిందీతోపాటు మరో 14 భాషల్లో ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఈ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవచ్చని ఎన్ఐఎన్ శాస్త్రవేత్తలు తెలిపారు.




## అదే మాట మీద ఉండండి చంద్రబాబూ!

రాష్ట్రం పన్నుల రూపంలో చెల్లించిన డబ్బునంతా కేంద్రం తిరిగి ఇచ్చేస్తే సొంతంగానే కడప ఉక్కుకర్మాగారాన్ని నిర్మించుకుంటాం.. అని చెప్పిన మాటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కట్టుబడి ఉండాలని లోక్‌సత్తా పార్టీ కూకట్‌పల్లి నేత పేరిచర్ల భవానీ అన్నారు. "చంద్రబాబు గారూ! అదే మాట మీద ఉండండి. మా గ్రామం కట్టిన పన్నుల డబ్బును కూడా మాకు తిరిగి ఇచ్చేస్తే మేమే మా గ్రామానికి కావలసిన సదుపాయాల్ని ఏర్పాటు చేసుకుంటాం" అని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ఢిల్లీలా ప్రతి నగర ప్రభుత్వానికీ సాధికారత కల్పించాలి: జేపీ

ఢిల్లీ ప్రభుత్వం శక్తిమంతమైన నగర ప్రభుత్వమని, ఢిల్లీ తరహాలో మనదేశంలోని ప్రతి నగర ప్రభుత్వానికీ ఇప్పటికైనా సాధికారత కల్పించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ పిలుపునిచ్చారు. ఎన్నికైన ప్రజాప్రభుత్వాన్ని బలహీనపరిచేలా లెఫ్టినెంట్ గవర్నర్ వ్యవహరించకూడదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని.. అధికార వికేంద్రీకరణ, ప్రజాస్వామ్యం, జవాబుదారీతనం కోరే వారందరూ ఆహ్వానించాలన్నారు.

❖

# రైతుల ప్రతి పథకం కౌలురైతుకూ అందాలి

రైతులకందుతున్న ప్రతి పథకం కౌలురైతుకు కూడా అందాలని జేపీ అన్నారు. సొంతభూమి ఉన్నవారు, కౌలు చేసుకుంటున్నవారు ఇద్దరూ రైతులేనని స్పష్టంచేశారు.

బాపట్ల కర్లపాలెంలోని పెద్దింటమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సురాజ్య యాత్ర కార్యక్రమంలో జేపీ రైతులతో ముఖాముఖి చర్చించారు.

ప్రభుత్వ విధానాలు రైతులకు అవకాశాలు లేకుండా చేస్తున్నాయని, సొంతభూమి ఉన్న రైతును కూడా కుంగదీస్తున్నాయని జేపీ అన్నారు. లోక్‌సత్తా చెబుతున్నట్టు రైతుకు ఆదాయం చుట్టూ వ్యవసాయ విధానాలను అమలు చేస్తే కౌలురైతు కూడా లాభపడతాడన్నారు. సూర్యరశ్మి, రుతుపవన వర్షపాతం, కష్టపడే రైతులు వంటి సానుకూల అవకాశాలు, ఉత్పత్తులకు తరగని డిమాండ్, యువత వంటి పలు సానుకూలాంశాలున్నా కూడా వ్యవసాయాన్ని ఎందుకు ప్రభుత్వాలు లాభసాటి చేయలేకపోతున్నాయో లోతుగా ఆలోచించాలన్నారు. రైతుకు సరైన సమయంలో విత్తనాలు, రుణాల్ని ప్రభుత్వాలు ఎందుకు అందించలేక పోతున్నాయన్నారు. రైతులకు రుణమాఫీ చేసినా ఆత్మహత్యలు ఎందుకు ఆగటం లేదు అని ప్రశ్నించారు. రైతు సమస్యలకు ప్రకృతి శాపం కారణం కాదని, పాలకుల పాపం వల్లే వ్యవసాయదారులు కుంగిపోతున్నారని అన్నారు. వ్యవసాయాన్ని నాశనం చేయటంతోపాటు ప్రభుత్వాలు అందించాల్సిన విద్య, ఆరోగ్యం విషయంలో కూడా మన పాలకుల వైఫల్యం రైతులను తీవ్రంగా దెబ్బతీస్తోందన్నారు. పిల్లల చదువులు, కుటుంబ ఆరోగ్యం కోసం పలువురు రైతులు పొలాల్ని అమ్ముకుని పట్టణాల్లో కూలీలుగా, రోజువారీ సంపాదన చిరుద్యోగులుగా బతుకుతున్నారన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఇతర ధృవపత్రాల కోసం రైతులు లంచాలివ్వాల్సిన అవసరం లేకుండా 'పౌర సేవల' చట్టం తెద్దామన్న ధ్యాస కూడా పాలకులకు లేదన్నారు. రైతుకు ఇంత అన్యాయం చేస్తూ కూడా రైతే రాజు, రైతే దేశానికి పట్టుగొమ్మ వంటి నినాదాలతో రాజకీయ నేతలు ఓట్లు కొల్లగొట్ట గలుగుతున్నారన్నారు.

స్థానికంగా రైతులు ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యల్ని ఈ సందర్భంగా జేపీ అడిగి తెలుసుకున్నారు. ఏటికేడు మద్దతు ధర కూడా దిగజారిపోతుండటం దారుణమన్నారు. రెండేళ్ల క్రితం రూ. 14వేలు పలికిన మినుముల ధర ఇప్పుడు రూ. 3,800 ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని, వ్యవసాయం లాభసాటి చేయాల్సిన విధానాలపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను, రాజకీయ పార్టీలను కూడా ఒప్పించే ప్రయత్నం చేస్తానని తెలిపారు. కానీ అన్నిటికంటే ముఖ్యంగా రైతులు తమ సమస్యలపై అవగాహనతో స్పందించాలన్నారు. తమ ప్రయోజనాలేంటో తెలుసుకోకుండా రైతులు కులం, పార్టీ, ప్రాంతం, పంట పేరుతో విడిపోతుంటే పాలకులు పట్టించుకోవటం కష్టమన్నారు. రైతుల్లో చాలామంది మొబైల్ ఫోన్లు వాడుతున్నారని, యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదైన సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాలని సూచించారు.

పెనుమత్స నాగరాజు (చినబాబు), ఇక్కుర్తి నరసింహారావు, మంతెన దశరథమహారాజు, బమ్మనబోయిన సాంబయ్య, లోక్‌సత్తా, వైబీఐ నేతలు, తదితరులు పాల్గొన్నారు. ❖



**అందరూ ఇలా ప్రశ్నలు అడగాలి**

అరవై ఏళ్లు పైబడిన రైతుకు కులాలు, పార్టీలకతీతంగా పింఛను సౌకర్యం ఎందుకు కల్పించటం లేదు? గ్రామీణ ప్రాంతాల్లోని రైతు పిల్లలకు ఉద్యోగాల్లో ఎందుకు రిజర్వేషన్ కల్పించరు? అని మహిళా రైతు సాహితి ప్రశ్నించారు. అందరూ ఇలా ప్రశ్నలు అడగటానికి ముందుకు రావాలని జేపీ అన్నారు.

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

➤ కేంద్ర వ్యవసాయ మంత్రిగా నియమించిన బీజేపీ నేతకు ఆ పదవి ఆయన తెలివితేటల వల్ల రాలేదు. ఫలితంగా, నాలుగేళ్లలో దేశ వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు యూపీయే పదేళ్ల అభివృద్ధితో పోలిస్తే దాదాపు సగానికి పడిపోయింది. పంచదార పరిశ్రమ కోసం మోదీ ప్రభుత్వం ప్రకటించిన రూ.7,000 కోట్ల ప్యాకేజీ సమస్యను పరిష్కరిస్తుందా, కనీసం వాయిదా వేస్తుందా? అంటే జవాబు.. లేదనే చెప్పాలి. యూపీయే హయాంలో 3.7 వార్షిక సగటు వృద్ధిరేటు ఉన్నాగాని అప్పుడు కూడా వ్యవసాయంలో సంక్షోభం కొనసాగింది. బీజేపీ సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతోంది కానీ ఆ పార్టీ మాత్రమే పాలనా పగ్గాలను గుప్పిట్లో పెట్టుకుంది. దాని చర్యలే దాని ఫలితాలను నేడు నిర్దేశిస్తున్నాయంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఈ పరిస్థితుల్లో పరిణతి రాజకీయ పార్టీలాగా కాకుండా శైశవదశలో మరో అతిపెద్ద విజయాన్ని సాధించడానికి అది కృషి చేస్తున్నట్టు కనిపిస్తోంది.

–శేఖర్ గుప్తా, ద ప్రింట్ ఛైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్

➤ 'స్వాతంత్ర్యం వస్తే మన ఊరి హెడ్‌కానిస్టేబుల్ మారతాడా'.. అని గురజాడ అప్పారావు రాసిన కన్యాశుల్కంలోని ఒక పాత్ర ప్రశ్నిస్తుంది. వందేళ్ల క్రితం రాసిన కన్యాశుల్కంలో వేసిన ఈ ప్రశ్నకు ఇప్పటికీ ప్రాధాన్యత ఉన్నది. ఎవరు పోయినా, ఎవరు వచ్చినా వ్యవస్థలో మార్పులు లేకపోతే ప్రయోజనం లేదనే అభిప్రాయం గురజాడ తన కన్యాశుల్కంలోని ఒక పాత్ర ద్వారా వ్యక్తీకరించారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ఏదో జరుగుతుందనే ఆశ ప్రజల్లో కలుగుతూనే ఉంటుంది. నాలుగేళ్ల క్రితం నరేంద్రమోదీ అధికారాన్ని చేపట్టకముందు అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితులు, అవినీతి కుంభకోణాలు చుట్టుముట్టిన నేపథ్యంలో, ఆశ్రిత పెట్టుబడిదారులే రాజకీయాలను శాసిస్తున్న సమయంలో ప్రజలు ఒక మార్పును ఆశించారు. ఏ ఒక్క రంగమైనా ఈ నాలుగేళ్లలో బాగుపడిందా అంటే చెప్పడం కష్టం. ఢిల్లీ నడిబడ్డున ఉన్న అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో అడుగుపెడితే మన దేశ ఆరోగ్య వ్యవస్థ ఎంత దారుణంగా ఉన్నదో అర్థమవుతుంది. ఇక్కడ తెల్లవారుజామున 3 గంటల నుంచీ వేలాది మంది ఓపీడీ కార్డుల కోసం క్యూలు కడతారు. దాక్టర్ల గదుల ముందు కూర్చోవడానికి సరైన వసతి సౌకర్యాలు లేవు కదా, కనీసం నిలుచోవడానికి కూడా స్థలం ఉండదు. అనేక రోగాలతో, గాయాలతో సతమతమవుతూ ఎక్కడ అంటే అక్కడ పడుకున్న రోగులు, వారి బంధువులతో అదొక రోగిష్ఠి నిలయంగా కనపడుతుంది. అది వీఐపీలకు మాత్రమే మెరుగైన సేవలందించే ఆస్పత్రిగా మారింది. ఈ నాలుగేళ్లలో ఆరోగ్యమంత్రి జగత్ ప్రకాష్ నడ్డా ఏమి చేస్తున్నట్టు? ఆరోగ్య సంరక్షణలో అందుబాటుకు సంబంధించి భారతదేశం మొత్తం 195 దేశాల్లో 145వ స్థానంలో ఉంది.

– ఎ.కృష్ణారావు, సీనియర్ జర్నలిస్టు

➤ గడచిన పదేళ్లలో భారత ప్రధాని పాక్‌లో చేసిన తొలి పర్యటన మోదీదే! అదే స్థాయి చొరవను తరువాతి కాలంలోనూ ఆయన కొనసాగించి ఉంటే బాగుండేది. ఇప్పుడిక అలాంటి ఆశ కూడా లేదు. ఇది ఎన్నికల ఏడాది. ప్రధాని దృష్టి మొత్తం దక్షిణాదిలో పాగా వేసి అధికారాన్ని ఎలా నిలబెట్టుకోవాలన్న దాని మీదే ఉంటుంది.

-కులదీప్ నయ్యర్,
ప్రముఖ పాత్రికేయులు, బ్రిటన్‌లో భారత మాజీ హైకమిషనర్

➤ ప్రభుత్వం నుంచి తమ మఠానికి ఏమీ చేయకపోయినా ఫర్వాలేదని, సమాజంలో అవినీతిని నిర్మూలించాలని శృంగేరి మఠాధిపతి నాకు సూచించారు. అవినీతిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు నేను గనుక సిద్ధమైతే నన్ను ముఖ్యమంత్రి స్థానం నుంచే తప్పించే వ్యవస్థ ఏర్పడింది. ముల్లును ముల్లుతోనే తీయాలనే రీతిలో పూర్తిస్థాయిలో అవినీతిని నిర్మూలించేందుకు ప్రయత్నిస్తా.

–హెచ్‌డీ కుమారస్వామి, కర్ణాటక ముఖ్యమంత్రి

➤ అప్పటి ఆంధ్ర నాయకులకు ప్రత్యేకహోదాపై సరైన అవగాహన లేదు. నేను పిలిచి చెప్పాను. రాష్ట్రం విడిపోయే పరిస్థితి ఉంది.. మీకు ఏం కావాలో అడగమన్నాను. వారు వినలేదు. విడిపోకూడదని పోరాడారు తప్పితే.. విడిపోతే ఏమిటి? అని ఆలోచించలేదు. వీళ్ల దగ్గర ప్లాన్-బీ లేదు. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు నాకు రూ.28 వేలు ఖర్చయింది. చివరగా ఎంపీగా గెలిచినప్పుడు ఎంత ఖర్చుపెట్టానో చెప్పకూడదు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఎంపీగా గెలవడానికి వందకోట్ల వరకూ ఖర్చు చేశారు. అయితే వీళ్లు ఎవరూ రాజకీయ నాయకులు కాదు. ఆత్మకథ రాయటం ఇబ్బంది. ఎందుకంటే.. సత్యం చెప్పలేను, అసత్యం రాయలేను.

- ఎస్.జైపాల్ రెడ్డి, రాజకీయవేత్త

➤ *దేశంలో ప్రజాస్వామ్యం రానురాను ఖరీదైపోయింది. ఇప్పుడు ఎన్నికల్లో జాతిపిత మహాత్మాగాంధీ పోటీ చేయాల్సి వచ్చినా భారీగా ఖర్చు చేయకతప్పదు. ఎమ్మెల్యేగా గెలవాలంటే రమారమి రూ.10 కోట్ల వరకూ ఖర్చు చేయాలి.*

*– సీఎం ఇబ్రహీం, కర్ణాటక ఎమ్మెల్సీ*

➤ ప్రతి విషయంపై అద్భుతమైన పరిశోధన చేసి ఒక సమగ్ర అంచనాకు రావడం భారతీయ సంప్రదాయం. ఆ పరంపరను కొనసాగించాల్సిన అవసరం ప్రతి వ్యక్తిపై ఉంది.

– శంకర నారాయణ

➤ *శాంతియుత భవిష్యత్తు కోసం వివిధ రంగాల్లో వైవిధ్యపూరితమైన మార్పునే ఇవాళ ప్రపంచం కోరుకుంటోంది. కుటుంబం, సమాజం, ప్రపంచం ప్రయోజనం సాధించే అలాంటి మార్పును మేం ఒక కుటుంబంగా ఆస్వాదిస్తున్నాం. విద్య అనేది జీవితానికి సన్నాహకం కాదు జీవితమే విద్య.*

*+ డాక్టర్ ఎ. గౌతమ్, సినిమాటోగ్రాఫర్, డైరెక్టర్*

➤ *చైనా నుంచి పెద్దఎత్తున జరుగుతున్న దిగుమతుల విషయంలో భారత్ ఎలా ప్రతిస్పందించాలి? ఆ దిగుమతులపై సుంకాలు భారీ స్థాయిలో విధించడమే భారత్ స్పందనగా ఉండాలి. ఈ సుంకాలను పెంచితే డబ్ల్యుటీవో నుంచి మనకు ఎటువంటి సమస్యలు ఉండబోవు. చైనా నుంచి భారీ దిగుమతులకు ప్రధాన కారణాల్లో భారత్‌లో చిన్న మధ్య తరహా పరిశ్రమల్లో ఉత్పత్తి వ్యయం చాలా అధికంగా ఉండటం కూడా ఒకటి. ఎందుకని? ప్రభుత్వాధికారులకు, అయినదానికి కానిదానికి భారీస్థాయిలో లంచం ఇవ్వవలసి రావడం వల్ల మనదేశంలో చిన్న పరిశ్రమల్లో ఉత్పత్తి వ్యయం చాలా అధికంగా ఉంటోంది. పలువురు చిన్న పారిశ్రామిక వేత్తలతో నేను జరిపిన సంభాషణల్లో నాకు ఒక దిగ్భ్రాంతికరమైన విషయం తెలిసింది. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కిందిస్థాయిలోని అధికారులకు చెల్లించవలసివస్తున్న లంచాల మొత్తం విపరీతంగా పెరిగిపోయిందనేదే ఆ కఠోర వాస్తవం. చైనీస్ దిగుమతులను భారతీయ చిన్న పరిశ్రమలు సమర్థంగా ఎదుర్కోవాలంటే తప్పనిసరిగా తీసుకోవలసిన రెండు చర్యలు: భారీ దిగుమతి సుంకాలు విధించడం, ప్రభుత్వ యంత్రాంగంలో కిందిస్థాయిలో అవినీతిని తగ్గించడం. ఫ్లిప్‌కార్ట్‌ను చైనా సరకుల అతిపెద్ద కొనుగోలుదారు వాల్‌మార్ట్ స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకించడానికి బదులు ప్రస్తావిత సమస్యలను సమర్థంగా ఎదుర్కోవాలి.*

*- భరత్ ఝున్‌ఝున్‌వాలా, ఆర్థికవేత్త*

(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, సోషల్ మీడియా) ❖

# గోళ్లూడగొట్టి ట్యాక్సులు వసూలు చేస్తున్నారు.. సేవలేవీ?

ప్రజల నుంచి గోళ్లూడగొట్టి మరీ వేల కోట్ల రూపాయల పన్నులు వసూలు చేస్తున్నారు. కానీ ప్రజలకు ఆరోగ్యాన్ని అందించటాన్ని మాత్రం పట్టించుకోవటం లేదు. ఇదేం పాలన? పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యాన్ని విస్మరించేలా పాలన చేయటం క్షమార్హంకాదు" అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ అన్నారు.

అనంతపురం సురాజ్య యాత్రలో భాగంగా పలు కార్యక్రమాల్లో పాల్గన్న జేపీ.. నగరంలోని సర్వజన ఆస్పత్రిని సందర్శించారు. తొలుత ఆస్పత్రి ఇంఛార్జి పర్యవేక్షకుడు ఆచార్య వెంకటేశ్వరరావు, ఆర్‌ఎంవో డాక్టర్ లలిత, ఉప ఆర్‌ఎంవో డాక్టర్ విజయమ్మలతో సమీక్షించారు. బడ్జెట్ ఎంత? రోగులు ఎంతమంది? పడకలు ఎన్ని? వైద్య సీట్లు ఎన్ని?.. అడిగి తెలుసుకున్నారు. తర్వాత లోక్‌సత్తా ప్రతినిధులు అశోక్, అమర్‌యాదవ్, ప్రముఖ వైద్యులు డాక్టర్ కొండయ్య, డాక్టర్ శ్రీనాథ్ తదితరులతో కలిసి ప్రసూతి విభాగం, నవజాత శిశు వైద్య కేంద్రాన్ని సందర్శించారు. రోగులతో, సహాయకులతో మాట్లాడారు.

అనంతరం మాట్లాడుతూ, అనంత బోధనాస్పత్రిలో 500 పడకలు ఉంటే, ఏకంగా ఐపీలో 1200మంది రోగులు ఉన్నారని జేపీ అన్నారు. బెడ్‌కు ఇద్దరు కంటే ఎక్కువ రోగులుండటం వల్ల నేల మీద కూడా పడకలు ఉన్నాయన్నారు. మరో 2,000మంది ఐపీ రోగులు సేవలు పొందుతున్నారన్నారు. సిబ్బందికి సంబంధించి మాత్రం 600కి పైగా ఖాళీలున్నాయన్నారు. దీంతో పనిభారం రెట్టింపుపైగా ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు నాణ్యమైన సేవలు ఎలా అందుతాయన్న ఇంగితజ్ఞానం కూడా పాలకుల్లో కరవైందన్నారు. జీతాలు, మందులు ఇలా అన్నిటికీ కలిపి కేవలం రూ.85కోట్ల బడ్జెట్‌ను అందిస్తున్నారని, కానీ ఆస్పత్రి మాత్రం రూ.250కోట్ల విలువైన సేవలను అందిస్తోందని అన్నారు. వీలున్నంత వైద్యం అందించటమే తప్ప నాణ్యమైన వైద్యం అందించే పరిస్థితులు లేకపోవటం వల్ల ప్రజారోగ్యం సంక్షోభం ఎదుర్కొంటోందని, సొంత డబ్బుతో ప్రైవేటు వైద్యం చేయించుకునే సామాన్యుల్లో పలువురు అప్పులపాలై పేదలుగా మారిపోతున్నారని అన్నారు.

పారిశుద్ధ్యం, ఎస్‌ఎన్‌సీయూ సేవలు, శస్త్రచికిత్సలు, ప్రసవాలు వంటి కొన్ని సేవలు మెరుగపడ్డాయని, అయితే



**తిరుమల ధర్మదర్శనం క్యూను తలపిస్తోంది**

ఇంత మంది రోగులా.. మీరు ఎలా వైద్యచికిత్స అందిస్తున్నారు? ప్రతి ఒక్కరిపై పనిభారం మరీ ఎక్కువగా ఉందే! ఆస్పత్రిలో రోగుల రద్దీ తిరుమలలో ధర్మదర్శనం క్యూలాగా ఉంది అని వైద్యులతో చర్చల్లో జేపీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రోజూ 45 ఆపరేషన్లు, 20 ప్రసవాలు జరుగుతున్నాయని వైద్యులు వివరించారు.

**ప్రతి ఒక్కరూ సేవాదృక్పథం అలవరచుకోవాలి**

సాయి సంస్థ ఆధ్వర్యంలో సర్వజన ఆస్పత్రిలో రోగులకు చేస్తున్న అన్నదాన కార్యక్రమంలో జేపీ పాల్గన్నారు. నిర్వాహకుడు విజయసాయిని అభినందించారు. ప్రభుత్వమేకాకుండా.. సమాజంలోని సంపన్నులు కూడా తమ వంతుగా సేవా కార్యక్రమాల్ని నిర్వహించాలన్నారు.

మౌలిక సమస్యలు మాత్రం ప్రభుత్వాస్పత్రుల్లో అలాగే కొనసాగుతున్నాయని జేపీ అన్నారు. సమస్యల్ని సకాలంలో గుర్తించి చర్యలు తీసుకోకపోతే ప్రజారోగ్యం ఇంకా క్షీణించి సంక్షోభం సామాజిక, ఆర్థిక రంగాలకూ విస్తరిస్తుందన్నారు. పక్కా కార్యాచరణతో అమలు చేస్తే.. కేవలం రూ.2000కోట్లలోపే రాష్ట్రంలో అందరికీ మెరుగైన ఆరోగ్యాన్ని గ్యారంటీగా అందించవచ్చన్నారు. క్రమంగా ప్రభుత్వానికి ఇప్పుడు వెచ్చిస్తున్న బడ్జెట్‌లో కూడా కొంత మిగిలే అవకాశముందన్నారు. ఇలా చేయకుండా విద్య, ఆరోగ్యం అందించకుండా ఉన్న ప్రభుత్వాలకు వేల కోట్ల పన్నులు ప్రజలు ఎందుకు కట్టాలి? అని సూటిగా ప్రశ్నించారు. ఈ ప్రధానరంగాల్లో పాలకుల నిర్లక్ష్యం వల్లే కులవివక్ష, నిరుద్యోగం, పేదరికం ఎడతెగకుండా కొనసాగుతున్నాయన్నారు. దీన్ని మార్చే విధానాలతోనే సురాజ్య యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. ❖




# మన ప్రజల్ని మనకన్నా బ్రిటీషువాళ్లే ఎక్కువగా నమ్మారు!



మన ప్రజల్ని మన పాలకులకన్నా బ్రిటీషువారే ఎక్కువగా నమ్మారని, స్థానిక ప్రభుత్వాలకు ఇప్పటికన్నా నాటి వలస పాలకుల హయాంలోనే ఎక్కువగా అధికారాలుండేవని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాశ్ నారాయణ్ అన్నారు. బ్రిటీష్ పాలన కాలంలో కలకత్తాకు చిత్తరంజన్‌దాస్, అలహాబాద్‌కు జవహర్‌లాల్ నెహ్రూ, సేలంకు రాజగోపాలాచారి, రాజమండ్రికి టంగుటూరి ప్రకాశం వంటి వారు మేయర్లుగా పనిచేసి ఎంతో ప్రభావం చూపగలిగారన్నారు. తర్వాతికాలంలో వారే జాతీయోద్యమంలో కీలకపాత్ర పోషించారన్నారు.

ప్రజల స్థానిక స్వయంపాలనను గౌరవించడం, స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని ఇవ్వడం, స్థానిక ప్రజాప్రతినిధులకు అధికారాలనివ్వడం 1958 తర్వాత స్వతంత్ర భారతదేశంలో క్షీణించటం వల్లే.. ఈవేళ పౌరసత్వం విలువ తెలియడం లేదని, రాజకీయం, పాలన గురించి అవగాహన ఉన్న నాయకత్వం తయారుకావడం లేదని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వాలు బలపడితేనే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు బదిలీ చేసే నిధుల్లో 30 నుంచి 40 శాతాన్ని స్థానిక ప్రభుత్వాలకు విధిగా అందించాలన్నారు.

విజయవాడలో గోపాలరావు ఠాకూర్‌జీ స్మారక సమితి నిర్వహించిన కార్యక్రమంలో "దేశాభివృద్ధిలో స్థానిక సంస్థలు.. రాజ్యాంగం అందించిన హక్కులు, అధికారాలు-అమలు' పై జేపీ కీలకోపన్యాసం చేశారు.

స్థానిక సంస్థలు అన్న పదమే తనకు నచ్చదని, స్థానిక ప్రభుత్వాలు అనాలని జేపీ సూచించారు. పాకిస్తాన్, చైనా వంటి దేశాల్లో కూడా స్థానిక ప్రభుత్వాలు మన వద్ద కంటే మెరుగ్గా ఉన్నాయన్నారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు ఇచ్చే వాటాలో 33 శాతం స్థానిక ప్రభుత్వాలకు ఇవ్వాలని తాను 14వ ఆర్థిక సంఘానికి మౌఖికంగా, లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశానని, అయితే కొంతమేర మాత్రమే పెంచారని వివరించారు. జాతీయ సమగ్రతకు భంగం వాటిల్లకుండా, స్థానిక ప్రభుత్వాల్లో అధికార దుర్వినియోగం జరగకుండా తగు చర్యలు తీసుకుంటూ స్థానిక స్వయంపాలనకు సమగ్ర చర్యలు తీసుకోకుంటే, భారతదేశ భవిష్యత్తుకు భరోసా ఉండదన్నారు. ఇలాంటి అంశాలు కాకుండా.. కులం, మతం, ప్రాంతం, తాత్కాలిక తాయిలాలు వంటివి ఎన్నికల ప్రచారాస్త్రాలుగా మారటం వల్ల ప్రజలు నష్టపోతున్నారన్నారు. నియోజకవర్గానికి పదుల కోట్ల చొప్పున ఇప్పుడు ఎన్నికల్లో చేస్తున్న ఖర్చు వల్ల... సమర్థులు, నిజాయతీపరులు రాజకీయాలకు దూరమవుతున్నారని, అధికార వికేంద్రీకరణతో స్థానిక ప్రభుత్వాలు బలోపేతమైతే మంచి నాయకత్వం పెరిగి ధనరాజకీయాలను కొంతమేర నిరోధించగలమని అన్నారు.

విభజన చట్టంలోని అంశాలను కేంద్రప్రభుత్వం అమలు చేయకపోవటం బాధాకరమని, ఈ హామీలపై తెలుగేతర నిపుణులతో అధ్యయనం పూర్తవుతోందని, మరోసారి నిపుణులతో సరిచూసి నివేదికను ప్రభుత్వాలు, ప్రజల ముందు ఉంచుతామని జేపీ తెలిపారు. హామీల సాధన కోసం అన్ని స్థాయిల్లో పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జన్మభూమి కమిటీల్ని వేయటాన్ని ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ తప్పుపట్టారు. బీజేపీ నేత యూవీ శ్రీనివాసరాజు సమావేశానికి అధ్యక్షత వహించారు. సామాజిక సమరసత కమిటీ జాతీయ కన్వీనర్ కె. శ్యామ్‌ప్రసాద్, లోక్‌సత్తా బజీర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

Posting Date 22-07-2018

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on July 16th, 2018

# సమకాలీన భారతంలో ఉదారవాద విలువలు



సమకాలీన భారతదేశంలో ఉదారవాద విలువల ప్రాధాన్యతపై నాసిక్ దేవలలీలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>**Lok Satta Times**<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad